


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 18 సంచిక : 15 | 01-03-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది.

వార్త 2లో




## కోకాపేటలో జలమండలికి 3.95 ఎకరాల భూమి

కోకాపేట్ నియోపోలిస్‌లోని శారదా పీఠం భూముల వ్యవహారంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు సంధించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. హరీశ్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వం శనివారం క్లారిటీ ఇచ్చింది. నియోపోలిస్‌లో జలమండలికి అదనంగా 3.95 ఎకరాల భూమి కేటాయింపు చేసినట్లు వివరించింది.

వార్త 2లో



## వికారాబాద్‌లో విషాద ఘటన.. ఆత్మహత్య చేసుకున్న మహిళా కానిస్టేబుల్

వికారాబాద్‌లో విషాదం నెలకొంది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ బలిజ దివ్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాయిబాబా కాలనీకి చెందిన బసవరాజ్ హోంగార్డుగా పనిచేసి ఆరేళ్ల క్రితం మరణించాడు. అతని మూడో కుమార్తె బలిజ దివ్య 2020వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. గత ఐదేళ్లుగా వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

వార్త 2లో

# మరోమారు యుద్ధమేఘాలు



### ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణి దాడులు
### ప్రతిదాడులకు దిగిన ఇరాన్



మరోమారు యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణ దాడులకు దిగింది. అణు ఒప్పందంపై అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు వినిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిని తామే చేశామని టెల్‌అవీవ్ ప్రకటించింది. శత్రు దేశం నుంచి పొంచివున్న ముప్పును తప్పించేందుకు ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి.

వార్త 2లో

### విశాఖ శారదాపీఠం ఆలయం
# కూల్చివేస్తే అడ్డుకుంటాం

వివరాలు 2లో..

- చట్టబద్ధంగా కేటాయించిన రెండెకరాలు లాగేసుకుంటారా
- దేవాలయాలు, మఠాలను మింగాలన్న ఆలోచన ఎందుకు
- కోకాపేట శారదాపీఠం భూముల స్వాధీనంపై హరీష్ ఆగ్రహం



కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజ శ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన మాట్లాడారు.

### యాదగిరీశుడి సేవలో
# త్రిపుర గవర్నర్



యాదగిరిగుట్ట, అక్షరకలం ప్రతినిధి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారిని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం కుటుంబసమేతంగా యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన.. వీవీఐపీ అతిథి గృహం నుంచి ప్రధానాలయంలోకి వెళ్లారు. ఆలయ ముఖ మండపం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోకి తీసుకెళ్లి స్వయంభు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి ప్రధానార్చక బృందం వేద ఆశీర్వచనం చేయగా.. ఏవో భవానీ స్వామి వారిప్రసాదాన్ని అందజేశారు.

### ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు
# నాంపల్లి కోర్టుకు హాజరైన సిఎం రేవంత్



హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. గతంలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసుల విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి ఎదుట ఆయన కోర్టులో హాజరై విచారణను ఎదుర్కొన్నారు.

వార్త 2లో

# ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి

2 లో..

జీతలు తగ్గించాలని సూచిస్తారా
విద్యారంగ అభ్యున్నతికి ఒక్క సిఫార్స్ ఏదీ
సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్



# మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

### పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.

# కోకాపేటలో జలమండలికి 3.95 ఎకరాల భూమి

### గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు నిర్మాణాలు

### హరీష్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వ వివరణ

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

కోకాపేట్ నియోపోలిస్‌లోని శారదా పీఠం భూముల వ్యవహారంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు సంధించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. హరీశ్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వం శనివారం క్లారిటీ ఇచ్చింది. నియోపోలిస్‌లో జలమండలికి అదనంగా 3.95 ఎకరాల భూమి కేటాయింపు చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఉన్న 8.75 ఎకరాలు ఎంబీఆర్, ఈఎల్ఎస్ఆర్ ల నిర్మాణానికే సరిపోతాయని స్పష్టం చేసింది. ఓహెచ్‌టీ, సైట్ ఆఫీస్, మెయింటెనెన్స్ కోసం అదనపు భూమి అవసరమని జలమండలి ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని గుర్తు చేసింది. 592 మీటర్ల ఎత్తులో భూభాగం - గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అనుకూలమని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంపింగ్ అవసరం లేకుండా నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని స్పష్టత ఇచ్చింది. బోజగుట్ట రిజర్వాయర్‌కు గోదావరి జలాల గ్రావిటీ సరఫరా చేస్తామని వివరించారు. తద్వారా ఓల్డ్ సిటీ, షేక్‌పేట్, రెడ్ హిల్స్, మెహిదీపట్నం ప్రాంతాలకు లాభం చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది.అంతేకాకుండా కరెంట్ ఛార్జీలు భారీగా ఆదా అవుతాయని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇక గోదావరి ఫేజ్- ప్రాజెక్ట్ ద్వారా అదనంగా 300 ఎంజిడి నీటి తరలింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# వికారాబాద్‌లో విషాద ఘటన..ఆత్మహత్య చేసుకున్న మహిళా కానిస్టేబుల్

**వికారాబాద్, అక్షరకలం ప్రతినిధి**

వికారాబాద్‌లో విషాదం నెలకొంది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ బలిజ దివ్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాయిబాబా కాలనీకి చెందిన బసవరాజ్ హోంగార్డుగా పనిచేసి ఆరేళ్ల క్రితం మరణించాడు. అతని మూడో కుమార్తె బలిజ దివ్య 2020వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. గత ఐదేళ్లుగా వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బలిజ దివ్య మృతదేహం వద్ద ఒక సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రియమైన అమ్మ, నా కుటుంబసభ్యులు నేను ఇటువంటి నిర్ణయం తీసుకున్నందుకు నన్ను క్షమించండి. నా చావుకు ఎవరు కారణం కాదు. మెంటల్ స్ట్రెస్ తట్టుకోలేక ఈ రాంగ్ స్టెప్ తీసుకుంటున్నా. అమ్మా.. నీకు నేను భారం కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నా. నాన్న ఉంటే బాగుండే అమ్మ. నాన్న లేనందుకే నీకు ఇన్ని కష్టాలు. నన్ను క్షమించు అమ్మా' అని అందులో రాసి ఉంది. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బలిజ దివ్య ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మరోమారు యుద్ధమేఘాలు

### ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణి దాడులు

### ప్రతిదాడులకు దిగిన ఇరాన్

**టెలిఅవీవ్, అక్షరకలం ప్రతినిధి**

మరోమారు యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్ క్షిపణ దాడులకు దిగింది. అణు ఒప్పందంపై అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు వినిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిని తామే చేశామని టెల్అవీవ్ ప్రకటించింది. శత్రు దేశం నుంచి పొంచివున్న ముప్పును తప్పించేందుకు ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ క్రమంలో టెల్అవీవ్ సైన్యం తమ దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. టెల్అవీవ్‌తో సహా పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. స్కూళ్లు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించింది. ఈ దాడుల్లో అమెరికా హస్తం కూడా ఉన్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా దాడుల నేపథ్యంలో పౌర విమానాలకు ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. అటు ఇరాన్, ఇరాక్‌లు కూడా గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇరాన్‌లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోయాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకెళ్లాయి. ఈ మేరకు ఆ దేశ మిలిటరీ వెల్లడించింది. ఇజ్రాయెల్-అమెరికా కలిపి కొన్నిగంటల క్రితం ఇరాన్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌వైపు నుంచి స్పందన వచ్చింది.



# విశాఖ శారదాపీఠం ఆలయం కూల్చివేస్తే అడ్డుకుంటాం

### చట్టబద్ధంగా కేటాయించిన రెండెకరాలు లాగేసుకుంటారా

### దేవాలయాలు, మఠాలను మింగాలన్న ఆలోచన ఎందుకు

### కోకాపేట శారదాపీఠం భూముల స్వాధీనంపై హరీష్ ఆగ్రహం

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**







కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి 1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే హెచ్ఎండీఏ కు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామిజీ చేతుల మీదుగా ప్రతిష్టా కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో శారద పీఠం కింద 16 దేవాలయాలు, లక్షలాది మంది భక్తులు ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా అంటూ.. కేసీఆర్ కట్టిన గుళ్లు, గోపురాలు, మఠాలను కూల్చడమేనా రేవంత్ రెడ్డి ఉద్దేశమని హరీష్ రావు మండిపడ్డారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చావు, ఖమ్మంలో ఇళ్లు కూల్చి 800 మందిని రోడ్డున పడేశావు. నీ పాలనలో అంతా కూల్చడమే తప్ప, నిర్మాణం లేదా అని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ వర్క్స్ ఊఓచాః కోసం ఈ స్థలం తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోందని తెలిపారు. వాటర్ వర్క్స్ కట్టాలంటే ఈ దేవాలయం స్థలమే దొరికిందా.. సరిగ్గా ఈ ఆలయానికి రోడ్డు అవతలే సర్వే నెంబర్ 239, 240 లలో 17 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది కదా, వాటర్ వర్క్స్ అక్కడ కట్టుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. ఆ 17 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి తన అల్లుడికి, మేనల్లుళ్లకు, వాళ్ల అనుచరులకు భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ అక్రమంగా కట్టబెట్టారని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద నేనే స్వయంగా అడిగితే ప్రభుత్వం ఇచ్చిన జవాబు ఇది అని తెలిపారు.. 10 ఎకరాలు ఇస్తే వాళ్లు 17 ఎకరాలు కబ్జా పెట్టారని పేర్కొన్నారు. ఓపెన్ ఆక్షన్ వేస్తే ప్రభుత్వానికి వందల కోట్లు వచ్చేవి. కానీ లోపల లోపల నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం ఓఆర్ఆర్‌కు కిలోమీటర్ లోపల ఎలాంటి క్రషర్లు ఉండకూడదు.. కానీ రేవంత్ రెడ్డి తన అల్లుడి కోసం ఇక్కడ ఏకంగా 5 రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్లు పెట్టించారని హరీశ్‌రావు తెలిపారు. పక్కన ఉన్న బిల్డర్లంతా తన అల్లుడి దగ్గరే కంకర కొనాలని, లేకపోతే అనుమతులు ఇవ్వమని బెదిరిస్తూ దందా చేస్తున్నారని పేర్కొన్నారు. అల్లుడికి వ్యాపారం చేసుకోవడానికి 17 ఎకరాలు ఇస్తావు కానీ.. హిందూ ధర్మాన్ని ప్రచారం చేసే శారద పీఠానికి ఉన్న రెండు ఎకరాలను మాత్రం లాక్కుని కూలుస్తావా అని మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే నీ ధర్మమా.. తక్షణమే ఆ అక్రమ క్రషర్లను క్యాన్సిల్ చేయాలని డిమాండ్ చేశారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా నిన్న రాత్రి 11:30 గంటలకు వందలాది మంది పోలీసులు, ఎంఆర్వోలు వచ్చి ఆలయం వద్ద పీఠాధిపతిని, నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాబినెట్ లో నిర్ణయం తీసుకునే ముందు పీఠాధిపతులతో మాట్లాడే కనీస సంస్కారం ఈ ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఉదయం నేను ఇక్కడికి వస్తున్నానని తెలియగానే పోలీసులు, ఆర్ఐ, తహసీల్దార్ అందరూ పారిపోయారని హరీశ్‌రావు తెలిపారు. దొంగల్లా దాక్కోవాల్సిన అవసరం పోలీసులకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఉదయం స్వాములు పూజలు చేస్తుంటే పోలీసులు అడ్డుకున్నారని.. దేవాలయంలో ఏళ్ల తరబడి జరుగుతున్న పూజలను ఆపే హక్కు, ధైర్యం రేవంత్ రెడ్డికి ఎవరిచ్చారని నిలదీశారు. స్వామిజీ గారు వాగ్వాదానికి దిగాక అరగంట తర్వాత పూజకు అనుమతించారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లని చెప్పి రైతుబంధు, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్మెంట్ బంద్ చేసినావు.. ఇప్పుడు గుళ్లను కూడా వదులుతలేవని సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. దేవుని మీద పడ్డవాడు ఎవడూ బాగుపడలేదు.. నీకేదో పోయేగాలం దాపురించింది, ఆ దేవుడి శాపం నీకు తప్పక తగులుతుందని అన్నారు. క్యాబినెట్‌లో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు దయచేసి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి ఈ దేవాలయాన్ని, మఠాన్ని కూల్చకుండా కాపాడాలని కోరారు. లేనిపక్షంలో ఈ దేవాలయ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ భక్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకునే బాధ్యత మాదే అని.. ఎంత దూరమైనా పోరాడుతాం తప్ప రాజశ్యామల ఆలయాన్ని కూల్చనివ్వమని స్పష్టం చేశారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

### నాంపల్లి కోర్టుకు హాజరైన సిఎం రేవంత్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. గతంలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసుల విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి ఎదుట ఆయన కోర్టులో హాజరై విచారణను ఎదుర్కొన్నారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా, అప్పటి ఎంపీలైన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి తరపున భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ర్యాలీలో సుమారు 40 కార్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ప్రచారం నిర్వహించారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. వారు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక 2021లో కరోనా మహమ్మారి సమయంలో తెలంగాణ ప్రభుత్వం విధించిన కోవిడ్ నిబంధనలను పాటించకుండా ఓ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొన్నారని కూడా రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. కోవిడ్ సమయంలో ప్రజా సమావేశాలపై పరిమితులు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, కోవిడ్ మార్గదర్శకాలు పాటించకపోవడం వంటి అంశాలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగా నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కోర్టు విచారణలో తదుపరి విచారణ తేదీని నిర్ణయించే అవకాశం ఉంది. కేసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో జరిగిన ప్రచారం, కోవిడ్ సమయంలో జరిగిన సమావేశాలకు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**కోనసీమ,**

ఆలమూరు మండల కేంద్రంలోని శ్రీ సిద్దార్థ పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 28న ఈ సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది స్కిన్నోవా .26 పేరుతో ఈ సైన్స్ దినోత్సవం లో దయినందిన జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రాధాన్యతను వివరించే విధంగా విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. విద్యార్థిని విద్యార్థుల్లో సృజనాత్మక, తార్కిక మేధస్సును పెంపొందించే ఈ ప్రదర్శనలు నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సివి రామన్ , రామన్ ఎఫెక్టును కనుగొని భారతదేశానికి నోబెల్ బహుమతిని తీసుకువచ్చిన సందర్భంగా ఆయన గుర్తు చేస్తూ ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ నమూనాలు, ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా రాకెట్ నమూనా, ఎలక్ట్రిక్ బెల్, వాల్కనో, విండ్ మిల్, సబ్మెరైన్స్ మొదలైన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిఫాల్స్ గుణశేఖర్, జెస్సి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని చెముడులంక నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టు వర్కులను తయారుచేసి ప్రదర్శించారు.

# ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి

### టీచరల్ జీతలు తగ్గించాలని సూచిస్తారా

### విద్యారంగ అభ్యున్నతికి ఒక్క సిఫార్స్ ఏదీ

### సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్

**హైదరాబాద్,**

ఇటీవల సిఎం రేవంత్‌కు సమర్పించిన విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముందని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విషయంలో రేవంత్‌రెడ్డిది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహించారు. అర్బన్ నక్సలైట్లను కమిటీల్లో వేస్తారని... లొంగిపోయిన మాజీలను ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు.

# బాణాసంచా ప్రమాద ఘటనపై జగన్ దగ్భ్రాంతి

**అమరావతి,**

కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంపై వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమన్న వైఎస్ జగన్.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడంపై వైఎస్.జగన్ ఆవేదన వ్య క్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ పేలుడు ఘటనలో పలువురు కార్మికులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# రాయితీపై డ్రోన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28:**

క్రాంతి పై డ్రోన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రికరణ ఆర్ కె వి వై - ఎస్ఎంఎఎం 2025- 26 సంవత్సరానికి గాను జిల్లాకు 10 వ్యవసాయ డ్రోన్లను కేటాయించడం జరిగిందని, ఇందులో 3 డ్రోన్లు మంచిర్యాల డివిజన్, 3 డ్రోన్లు చెన్నూర్ డివిజన్, 2 డ్రోన్లు బెల్లంపల్లి డివిజన్, 2 భీమిని డివిజన్ లకు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ డ్రోన్లను 40 శాతం, 4 లక్షల రూపాయల రాయితీపై అందించడం జరుగుతుందని, జిల్లాలోని ఎఫ్ పి ఓ లు, స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు గ్రూప్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉద్యానవన, ఆయిల్ పామ్ యంత్ర పరికరాలకు వ్యక్తిగతంగా రైతులు దరఖాస్తు చేసుకునే విధంగా సంబంధిత ఎడిఎలు, వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రూప్ క్యాటగిరి క్రింద డ్రోన్లు కొరకు దరఖాస్తు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి అని తెలిపారు.

# జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా శ్రీనివాస్ రావు బాధ్యతల స్వీకరణ



అక్షర కలం, మంచిర్యాల రాజస్వ మండల అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పని చేసిన పి చంద్రయ్య పదోన్నతి పై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా విధులు నిర్వహిస్తున్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతకు బాటలు --- ప్రశాంతంగా నైపుణ్య శిక్షణ ఫైనల్ పరీక్షలు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28. అక్షర కలం :**



మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారత లక్ష్యంగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ఫైనల్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో, గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వంత నిధులతో నిర్వహిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాలకు నియోజకవర్గానికి చెందిన మహిళలు ఉత్సాహంగా హాజరయ్యారు. కంప్యూటర్, మగ్గం పనితనం, బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి విభిన్న కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థుల కోసం నిర్వహించిన తుది పరీక్షలు మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణా కేంద్రంలో క్రమశిక్షణతో జరిగాయి. పరీక్షల నిర్వహణను సెట్విన్ సంస్థ చేపట్టిందని పర్యవేక్షకులు తెలిపారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ మాట్లాడుతూ, మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించే దిశగా ఈ శిక్షణా కార్యక్రమం కీలకంగా మారిందన్నారు. పరీక్షలు పూర్తిగా పారదర్శకంగా, ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించామని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని ఇంచార్జ్ నిజలింగప్ప, సెట్విన్ ఇంచార్జ్ విజయ్‌కుమార్ సమర్థంగా పర్యవేక్షించినట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను వినియోగించి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునే దిశగా అడుగులు వేస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక స్థితిగతులు మెరుగుపడటానికి ఈ శిక్షణలు తోడ్పడతాయని, భవిష్యత్తులో మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన ఉందని తెలిపారు. మొత్తం మీద మహిళలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా, ఉపాధి మార్గాలను సుస్థిరం చేసే దిశగా ఈ కార్యక్రమం ముందడుగుగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# కల్వకుర్తిలో నేడు విద్యుత్ అంతరాయం

**ఫిబ్రవరి 28 అక్షర కలం కల్వకుర్తి**

నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణం ఐపీడీఎస్ ఉపకేంద్రం ద్వారా సరఫరా అయ్యే కన్యకా పరమేశ్వరి, తిలక్ నగర్, జెపి నగర్, రాంనగర్ తండా ఫీడర్లకు నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.విద్యుత్ మరమ్మత్తు పనుల కారణంగా ఈ ఫీడర్ల ద్వారా సరఫరా అయ్యే తిలక్ నగర్, విద్యానగర్, కళ్యాణ్ నగర్, గాంధీనగర్, సిల్వర్ జూబ్లీ క్లబ్, బొక్కల కుంట, శివాలయం రోడ్, ఎల్లికల రోడ్, వాసవి నగర్, తిమ్మరాజు పల్లి, జెపి నగర్, భగత్ సింగ్ తండా, రామనగర్ తండా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతుంది.వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో మండల ఎంపీఓ సత్యనారాయణ మృతి

**మందమర్రి, ఫిబ్రవరి 28 అక్షర కలం ప్రతినిధి:**



జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పంచాయతీ అధికారి (ఎంపిఓ) ములకల సత్యనారాయణ (52) మృతి చెందారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, విధుల నిర్వహణ నిమిత్తం మంచిర్యాల పట్టణంలోని రాం నగర్ లో గల తమ నివాసం నుండి మందమర్రికి బయలుదేరి వస్తుండగా, శ్రీరాంపూర్ నుండి లక్షెట్టిపేట్ వైపు వెళ్తున్న లారీ (టిఎస్ 19 టిఏ 4929) అతి వేగంగా వచ్చి, సత్యనారాయణ ద్విచక్ర వాహనాన్ని వెనక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ తిరుపతి తెలిపారు.

# మహమ్మదాబాద్ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

**బొలెరో ఢీకొని యువకుడికి చేయి విరుగు... భార్యకు గాయాలు**

**108 సిబ్బంది అప్రమత్తతతో ఆసుపత్రికి తరలింపు**



మహమ్మదాబాద్ . ఫిబ్రవరి 28. అక్షర కలం : మహమ్మదాబాద్ అటవీ కార్యాలయం సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరొకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఇప్పాయపల్లి గ్రామానికి చెందిన మహిపాల్ (30) తన భార్య సుజాతతో కలిసి ద్విచక్ర వాహనంపై మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం, ఎదురుగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని బొలెరో వాహనం అదుపు తప్పి వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఢీకొట్టిన ప్రభావంతో మహిపాల్ రహదారిపై పడిపోవడంతో అతనికి కుడి చేయి విరిగింది. తీవ్ర నొప్పితో అక్కడికక్కడే విలవిలలాడగా, పక్కనే ఉన్న భార్య సుజాతకూ కుడి చేయికి గాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు.

# పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదవాలి.. అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**



పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం రాయగిరి లోని లింగబసవ గార్డెన్స్ లో ఎస్సీ, ఎస్టీ, బి.సి వెల్ఫర్ విద్యార్థిని , విద్యార్థులకు జరిగిన ప్రేరణ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు క్రమ శిక్షణతో, నిరంతరం కష్టపడి చదువుతూ పదవ తరగతి పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు వార్షిక పరీక్షల సమయంలో ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్య లభించే విరామ సమయాన్ని వృదా చేయకుండా, విద్యార్థులు అభ్యాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. వెనుకబడిన సబ్జెక్టులపై ఒకటికి రెండు సార్లు చదివి నివృత్తి చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తదుపరి పరీక్షకు సంబంధించిన ముఖ్య అంశాల పునశ్చరణ నిర్వహించాలని సందేహాలను నివృత్తి చేయాలన్నారు. విద్యార్థుల్లో పరీక్ష భయం లేకుండా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పరాంకుశం సాహితి, యాదాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఏబిసిడిఓ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ లు ఎస్సీ , ఎస్టీ, బిసి వసతి గృహ సంక్షేమ అధికారులు, మరియు అధ్యాపకులు పాల్గొనారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు కృషి చేస్తా

**మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

**నల్లగొండ మేయర్ దంపతులకు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**





మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానని నల్గొండ కార్పొరేషన్ తొలి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుంటానని ఆమె హామీ ఇచ్చారు. నల్గొండ నగర తొలి మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులను శనివారం నల్గొండ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించి సత్కరించారు. ప్రెస్ క్లబ్ మెమెంటో ను అందజేశారు. ఈ సందర్భంగా నల్గొండ పట్టణం లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఏళ్ల తరబడి జిల్లా కేంద్రం లో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. నగర తొలి మేయర్ గా రికార్డు సృష్టించిన చైతన్య శ్రీనివాస్ రెడ్డికి నగర అభివృద్ధి విషయం లో సంపూర్ణ సహకారం అందిస్తామని జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, ఉపాధ్యక్షులు యాదయ్య, మదనాచారి, కార్యదర్శులు వరకాంతం కిరణ్ రెడ్డి, లింగయ్య, సహాయ కార్యదర్శులు మహమ్మద్ సయ్యద్, నత్తి ఉపేందర్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సోమ శేఖర్, అశోక్ కుమార్, భాస్కర్, వెంకన్న, రవి, కృష్ణ, దశరథ, కారింగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రతిష్టకు భంగం కలిగించే నివేదికలు ఉపసంహరించాలి

**టీఎస్ యుటిఎఫ్ గండీడ్ మండల నాయకుల డిమాండ్**



గండీడ్. ఫిబ్రవరి 28. అక్షర కలం: రాష్ట్ర విద్యా కమిషన్ తన పరిధికి చెందని అంశాలపై ప్రస్తావనలు చేయడం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) గండీడ్ మండల అధ్యక్షుడు గంట శ్రీనివాస్, కార్యదర్శి పగిడ్యాల బోరు కృష్ణయ్య తీవ్రంగా విమర్శించారు. విద్యా కమిషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు సమర్పించిన నివేదికలో కమిషన్ పరిధిలో లేని ఉపాధ్యాయుల జీతాల అంశాన్ని ప్రస్తావించడం ఆశ్చర్యకరమని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల వసతులు, ఖాళీ పోస్టులు, విద్యా నాణ్యత వంటి కీలక అంశాలపై స్పష్టమైన సూచనలు చేయకుండా జీతాల అంశాన్ని ప్రస్తావించడం సరైన విధానం కాదన్నారు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు సంబంధించిన పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపులపై ఎలాంటి చర్చ లేకపోవడం బాధాకరమని తెలిపారు. వేతనాల ఆలస్యం, ప్రమోషన్ల లోపం, సేవా నియమాలపై స్పష్టత లేకపోవడం వంటి అనేక సమస్యలు ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసేలా నివేదికలో వ్యాఖ్యానించడం తగదని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయులే ప్రధాన బలం అని, వారి ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా ప్రభుత్వము, కమిషన్ వ్యవహరించాలని కోరారు. తక్షణమే విద్యా కమిషన్ జీతాలపై చేసిన సిఫారసులను ఉపసంహరించుకుని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని టీఎస్ యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం...

**అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ:--**

నాగార్జునసాగర్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు .శనివారం నాడు ఉదయం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి ప్రిన్సిపల్ రవికుమార్ ఇతర ఉపాధ్యాయులు , అధ్యాపకులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ సైన్స్ ని అభివృద్ధి చేయడానికి సి.వి.రామన్ ఎంత కృషి చేశాడో ఆయన కనిపెట్టిన అంశాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులందరూ సివి రామన్ ని ఆదర్శంగా తీసుకొని నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలి అన్నారు .అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా విద్యార్థులు అనేక సాంకేతిక పరమైన యంత్రాలను తదితర వాటిని తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను పెంచల్ రవికుమార్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏటిపి సంతోష్ , సరిత , ఉపాధ్యాయులు పాల్గొన్నారు .




# స్వీయ రక్షణాత్మక వాహన నడపంతో సురక్షిత ప్రయాణం

**యువతకు జిల్లా పోలీసు అధికారి జానకి చైతన్యం**

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 28. అక్షర కలం :**

రోడ్డు ప్రమాదాల నివారణలో యువత పాత్ర అత్యంత కీలకమని జిల్లా పోలీసు అధికారి డి. జానకి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర పోలీసు శాఖ ప్రధాన అధికారి శివధర్ రెడ్డి ఆరంభించిన రోడ్డు భద్రత చైతన్య కార్యక్రమం భాగంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని వాసవి డిగ్రీ కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన జానకి, స్వీయ రక్షణాత్మకంగా వాహనం నడపడం అనేది ప్రమాదాలను ముందుగానే ఊహించి జాగ్రత్తలు పాటించడం అని వివరించారు. వాహనం నడుపుతున్నప్పుడు చుట్టూ ఉన్న పరిస్థితులను గమనించడం, ఇతరుల పొరపాట్లను ముందే అంచనా వేయడం, వేగాన్ని నియంత్రణలో ఉంచడం, తగిన దూరం పాటించడం వంటి అలవాట్లు ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. చేతి దూరవాణి వినియోగం, అలసట లేదా నిద్రమత్తులో వాహనం నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు మరియు వెనుక కూర్చున్నవారు తప్పనిసరిగా రక్షణ టోపీ ధరించాలని, దాని పట్టీ బిగించి ఉంచాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ భద్రతా పట్టీ ధరించడం ద్వారా ప్రమాద సమయంలో ప్రాణ రక్షణ పొందవచ్చని తెలిపారు. అధిక వేగం, ముగ్గురు కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వంటి అలవాట్లు యువత ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్ట విరుద్ధమని, అది ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదమని పేర్కొన్నారు. రవాణా సంకేతాలను కచ్చితంగా పాటించడం, ఆగాల్సిన గీత దాటకపోవడం, పాదచారులు దాటే ప్రదేశాల్లో వారికి ముందస్తు అవకాశం ఇవ్వడం ప్రతి వాహనదారుడి బాధ్యత అని స్పష్టం చేశారు. భారీ వాహనాల సమీపంలో ప్రయాణించేటప్పుడు కనిపించని ప్రదేశాలను గుర్తుంచుకోవాలని, ఎడమ వైపు నుంచి దాటకూడదని, అకస్మాత్తుగా ముందుకు చొరబడవద్దని సూచించారు. పాఠశాలలు, మార్కెట్లు, నివాస ప్రాంతాల్లో వేగం తగ్గించి పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటేటప్పుడు సహాయం చేయడం ప్రతి పౌరుడి కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమ ప్రారంభంలో కళాబృందం సభ్యులు రోడ్డు ప్రమాదాల తీవ్రతను నాటికల




ద్వారా వివరించి చైతన్యం కల్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారి దృశ్య ప్రదర్శన ద్వారా ఇటీవల జరిగిన ప్రమాదాలు, వాటి కారణాలు, వాహనం నడిపేటప్పుడు జరిగిన పొరపాట్లను విద్యార్థులకు వివరించారు. ఇకముందు అధిక వేగం, రవాణా నియమాల ఉల్లంఘనలు చేయకుండా రక్షణ టోపీ, భద్రతా పట్టీ వినియోగం మరియు స్వీయ రక్షణాత్మక వాహన నడపడం అలవాటు చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. “మీ జాగ్రత్తే మీ కుటుంబానికి రక్షణ. యువత నియమాలు పాటిస్తే సమాజం మొత్తం సురక్షిత దిశగా ముందుకు సాగుతుంది” అని ఆమె సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉపాధికారి వెంకటేశ్వర్లు, పట్టణ ఇన్స్పెక్టర్ అజాజుద్దీన్, మహిళా పోలీసు స్థానం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రధానోపాధ్యాయుడు కొండా స్వామి, విద్యా నిర్వహణాధికారి రజినీకాంత్, వ్యవహారాల బాధ్యులు శ్రీనివాసయ్య తదితరులు పాల్గొన్నారు. సుమారు 400 మంది విద్యార్థులు హాజరై రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# చీప్ ....లిక్కర్ పాలసీ కేసు !

**లిక్కర్ కేసు ఉత్తిదే అని తేలిపోయింది. అభియోగాలు కాదు..ఆధారాలు చూపండి అని కోర్టు వేసిన ప్రశ్నలకు సిబిఐ బిక్కచచ్చిందనే చెప్పాలి. అభియోగాలు సరే..ఆధారాలు ఉన్నాయా అని నిలదీసింది. ఆధారాలు లేకుండా ఎలా కేసు నమోదు చేశారని ప్రశ్నించింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఢిల్లీ లిక్కర్ కేసును కొట్టివేసింది. ఈ వ్యవహారంతో ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా 23మంది నిర్దోషులగా కోర్టు తేల్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా..సిబిఐ ఎందుకింత నిర్లక్ష్యంగా, నిస్తేజంగా తయారయ్యిందన్న అనుమానం కలుగుతోంది. సిబిఐ లాంటి సంస్థ లిక్కర్ పాలసీ కేసులో పక్కా ఆధారాలు లేకుండా ఎందుకింత డ్రామా నడిపిందన్నదే అనుమానం. ఇక్కడే ఆధారాలు లేవని కోర్టు తేల్చింది. అయినా హైకోర్టులో సవాల్ చేస్తామని చెబుతోంది. అక్కడా ఇలాగే ఎదురుదెబ్బలు తప్పవంటే...ఆధారాలు రెడీ చేసుకోవాలి. అలాంటి ఆధారాలు ఉన్నాయా అన్నది సిబిఐకే తెలియాలి. నిజానికి ఈ కేసులో ఆధారాలు ఉండివుంటే సిబిఐ బలంగా పోరాడి ఉండేది.**

కానీ ఆధారాలు లేకుండా కేసులు పెట్టడం వల్ల కేజ్రీవాల్ రాజకీయ జీవితం దెబ్బతింది. కవిత రాజకీయ జీవితం దెబ్బతింది. అంటే ఇదంతా ఓ పద్దతి ప్రకారం, ఓ ప్లాన్ ప్రకారం జరిగిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆయేషా మీరా కేసు, వైఎస్ వివేకానంద కేసు, ఇప్పుడు లిక్కర్ పాలసీ కేసు కూడా తుస్సుమంది. ఏ విషయంలోనూ సిబిఐ విజయం సాధించలేదు. అయితే రాజకీయంగా మోడీ, అమిత్ షాలు విజయం సాధించారు. ఈ కేసులతో వారు రాజకీయంగా లబ్ది పొందారనే చెప్పాలి. ఇకపోతే ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ సిఎంను ఆరు నెలలపాటు జైలులో పెట్టారు. మనీష్ సిసోడియాను రెండేళ్లకు పైగానే జైల్లో పెట్టారు. కవితను కూడా ఓ ఆరు నెలలు జైల్లో పెట్టారు. ఇప్పుడు వారి జీవితాల్లో ఓ మచ్చ పడింది. వారు నిర్దోషుల ని కోర్టు తెలిపింది. అయితే ఈ జైలు జీవితం అనుభవించడానికి కారణమైన సిబిఐ ఏం సమాధానం చెబుతుందన్నదే ప్రశ్న. పలుకుబడి ఉన్నవారే ఇంతటి నరకానికి గురయితే ఇక, సామాన్యుల గతేం కాను. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ వ్యవహారంలో ఈడీ అధికారులు అరెస్టు వెనక.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తలపెట్టిన రాజకీయ యాగం ఉందని ఆనాడు నమ్మని వారికి ఇప్పుడు నిజమని తోస్తున్నది. ఈ ప్రశ్నకు అప్పుడే సమాధానం లభించినా ఎవ్వరూ నమ్మలేదు. లిక్కర్ పాలసీ కేసు నిజమే కాబోలని అంతా అనుకున్నారు. ఎందుకంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాషాయ ఏలుబడి లోకి రావాలన్న మోదీ సంకల్పంలో భాగంగానే కేసులని అర్థం అవుతోంది. యూపీఏ హయాంలో అన్నా హజారేతో కలసి అవినీతి వ్యతిరేక ఉద్యమం నడిపిన కేజ్రీవాల్... ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలపై అరెస్టవడం మోదీ మహిమ కాక మరోటి కాదని ఇప్పుడు తేలిపోయింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరక ముందు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారిగా పనిచేసిన కేజ్రీవాల్‌పై సర్వీస్‌లో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు లేవు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. ఆమ్ ఆద్మీ పార్టీని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనుకున్న తర్వాతే ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. తనకు పోటీగా వస్తున్నాడని మోడీ భావించినందు వల్లనే పక్కాగా ఈ కేసు పథక రచన సాగిందని, తాజాగా ఢిల్లీ రౌస్ అవెన్యూ ఇచ్చిన తీర్పుతో స్పష్టం అయ్యింది. ఈలోగా కేజ్రీవాల్‌కు జరగాల్సిన డ్యామేజీ జరిగి పోయింది. మద్యం కేసులో స్వీకరించిన ముడుపుల మొత్తాన్ని పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని ఈడీ ఆరోపించడంతో పాటు, పెట్టిన కేసులతో ఆయన పరువు గంగలో కలిసింది.ఎంతగా అంటే ఆప్ పార్టీ అతః పాతాళానికి తొక్కివేయబడింది. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కుమార్తె కవితను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు లిక్కర్ కేసులో అరెస్టు చేసి ఢిల్లీ జైల్లో పడేశారు. ఆరు నెలలు ఆమె జైలులో మగ్గాల్లి వచ్చింది. కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న చర్చ జరిగింది. ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం అన్న ప్రచారం జరిగింది. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకున్నది చాలక లిక్కర్ కేసులో తలదూర్చారని అంతా న ఇందించారు. సంపాదించింది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారని దుమ్మెత్తి పోశారు. ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే కవితకు న్యాయస్థానాలలో ఉపశమనం లభించకుండా అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన దివంగత శిబూ సోరెన్ జైలుకు కూడా వెళ్లారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కుమారుడు హేమంత్ సోరెన్‌ను కూడా జైల్లో పెట్టారు.
ఇదంతా కూడా మోడీ రాజకీయ చతురతలో భాగమా అన్న అనుమానాలు ఉన్నాయి. జైలుకు వెళ్లిన వారు ఔననే అంటున్నారు. రాజకీయంగా బిజెపిని విస్తరించే క్రమంలో తమకు అడ్డుగా



ఉన్న పార్టీలను అడుసు లోకి తొక్కే ప్రయత్నంలో భాగంగానే కేసులతో జైల్లో కుక్కారన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలు ఎలా ఉన్నా కోర్టు తీర్పుతో ఇప్పుడది నిజమని స్పష్టం అవుతోంది. అదను చూసి దెబ్బ కొట్టాలని అంటారు. కేజ్రీవాల్, కవితలను అరెస్టు చేయడం, కేసు వీగి పోవడం వంటి పరిణామాలు ఇప్పుడు బీజేపీకి కీడు చేసే అవకాశం ఎక్కువగా ఉంది. వీరంతా మరోమారు మోడీ లక్ష్యంగా గళం విప్పే అవకాశం ఉంది. ప్రధాని మోదీని ఎదిరించడం అసాధ్యమని గుర్తించిన నాయకులు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై సామంత రాజులుగా మారిపోయి అధికారంలో కొనసాగగలుగుతున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీకే పరిమితమై ఉన్నట్టయితే గోవా, పంజాబ్ ఎన్నికల్లో తలదూర్చేవారు కాదు. ఢిల్లీని ఏలుకోమని ప్రజలు ఆశీర్వదిస్తే దేశాన్ని ఏలుతానని బయలుదేరి ఇప్పుడు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి కొనితెచ్చుకున్నారు. ఆమ్ ఆద్మీ పోటీ చేయడం వల్ల అనేక రాష్ట్రాలలో ప్రతిపక్ష ఓట్లు చీలి బీజేపీ లాభపడింది. ప్రతిపక్షాల అనైక్యత, రాజకీయ దురాశ వల్ల రాజకీయంగా పెనుభూతంగా మారిన ప్రధాని మోదీని ఇప్పుడు అందరూ ఏకమైనా కదిలించలేని పరిస్థితి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిన్నటి వరకు ఎగిరెగిరి పడ్డారు. ప్రధానమంత్రి అయిపోదామని కలలుగన్నారు. స్వరాష్ట్రంలో ఎదురు ఉండకూడదని వామపక్ష కూటమిని దెబ్బతీశారు. అధికారంలో కొనసాగాలంటే నరేంద్ర మోదీ రాజకీయ చదరంగంలో ఆరితేరాలి.

# నల్లగొండ "నవశకం"

**స్మార్ట్ సిటీ దిశగా అడుగులు**
**రాజకీయాలు పక్కన పెట్టి నగరాభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దాం**
**మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపు**
**వచ్చే ఏడాది నాటికి ఇంటింటికీ 24 గంటల కృష్ణా జలాలు**
**మున్సిపల్ కౌన్సిల్ తొలి సమావేశంలో కీలక నిర్ణయాలు**
**మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నిధుల వెల్లువ**








ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

నల్లగొండ నగర ముఖచిత్రాన్ని మార్చేందుకు, ఆధునిక హంగులతో కూడిన స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం నడుం బిగించింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన తొలి కార్పొరేషన్ సమావేశం నగర అభివృద్ధికి దిక్సూచిగా నిలిచింది. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి, ప్రజల సంక్షేమమే పరమావధిగా కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. నగర ప్రజల దశాబ్దాల కల అయిన నిరంతర తాగునీటి సరఫరాపై మేయర్ స్పష్టమైన హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నాటికి నల్లగొండలోని ప్రతి ఇంటికి 24 గంటల పాటు కృష్ణా జలాలు అందించేలా పక్కా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఇందుకోసం అవసరమైన మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.

**చీకటిని తరిమికొట్టి.. వెలుగులు నింపి..**

పట్టణంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు పడుతున్నాయి.ఇప్పటికే 5 కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టగా, ఒకటి పూర్తయింది. రాబోయే వేసవి నాటికి మిగిలినవి పూర్తి చేసి, లో వోల్టేజ్ సమస్య లేకుండా చూస్తామని మేయర్ హామీ ఇచ్చారు. వీధిలైట్ల సమస్యపై పలువురు కార్పొరేటర్లు వ్యక్తం చేసిన ఆందోళనపై స్పందిస్తూ, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ప్రకాశం బజార్ పునరుద్ధరణ..**
**పారిశుధ్యంపై ఫోకస్...**

ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న ప్రకాశం బజార్ ప్రాంతంలోని వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా దుకాణాలు కేటాయించామని, అక్కడ వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అలాగే దోమల ఉధృతి, పారిశుధ్య లోపంపై కార్పొరేటర్ల ఫిర్యాదులను స్వీకరించిన మేయర్, ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్‌కు సూచించారు. 10వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో భారీగా నిధులు మంజూరు చేయించుకుని, నల్లగొండను రాష్ట్రంలోనే అగ్రగామి నగరంగా నిలుపుతాం. కార్పొరేటర్లు ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు అని మేయర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ, కమిషనర్ బి. శరత్ చంద్ర, కార్పొరేటర్లు ఎండి. మహబూబ్ అలీ, మారగోని భవాని గణేష్, మందడి లిఖిత సైదిరెడ్డి, రేగట్టే అండాలు లింగస్వామి, దాసరి సాయి, ఇటుకల మంగమ్మ, ఇబ్రహీం, కేసాని వేణుగోపాల్ రెడ్డి, అబ్బగోని కవిత, బోయినపల్లి వేదశ్రీ, యామ కవితరాణి, ఇంకా పలు వార్డ్ ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పాలమూరులో నూతన మేయర్, డిప్యూటీ మేయర్‌లకు ఘన సన్మానం

**గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సత్కారం -- పట్టణాభివృద్ధికి సమన్వయమే మార్గం : మరేపల్లి సురేందర్ రెడ్డి**





మహబూబ్‌నగర్. ఫిబ్రవరి 28 (అక్షర కలం ): నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్‌లకు పాలమూరులో ఘన సన్మానం జరిగింది. మహబూబ్ నగర్ శ్రీ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డిప్యూటీ మేయర్ మరేపల్లి సురేందర్ రెడ్డి (ఎంఎస్ఆర్) మాట్లాడుతూ, పాలమూరు పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, యువత, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాభివృద్ధి ఒక్కరితో సాధ్యంకాదని, సమిష్టి కృషి ద్వారానే శాశ్వత మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తమపై గణేష్ ఉత్సవ సమితి సభ్యులు చూపిన గౌరవానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ధర్మం, సంస్కృతి, సమాజ శ్రేయస్సు, ఐక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణలో సమితి ముందుండాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలోనూ సమితి చురుకుగా పాల్గొని పట్టణాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి బాలయ్య, మనోహర్ రెడ్డి, గోపాల్ యాదవ్, రాములు, అంజయ్య, మోహన్ యాదవ్, వసంతపు వెంకటేష్, లక్ష్మణ్, నాగరాజు, రెబ్బ విగ్నేష్, నల్లమద్ది సురేందర్ రెడ్డి, జనార్ధన్, మాల్యాద్రి రెడ్డి, బీచని శ్రీధర్, బుచ్చా రెడ్డి, నరేందర్, నలిగేసి లక్ష్మీనారాయణ, సానేమ్ నిరంజన్, శ్రీశైలం, దయనంద్, మఠం మయుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉచిత గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ

**అక్షర కలం వనపర్తి :**



వనపర్తి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేసే అరుదైన అవకాశాన్ని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆర్‌సెటి కల్పిస్తోంది.యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలో పలు ఉచిత శిక్షణా కోర్సులు త్వరలో ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు.10వ తరగతి ఉత్తీర్ణత కలిగి వనపర్తి జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన అభ్యర్థులు ఈ కోర్సులకు అర్హులని ఆయన పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం ఉచిత భోజనం కల్పిస్తామని, ఎటువంటి ఫీజులు వసూలు చేయబోమని స్పష్టం చేశారు.శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామని, ఆ సర్టిఫికెట్ ఆధారంగా బ్యాంకు రుణాలు పొందుతూ స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు.అందుబాటులో ఉన్న కోర్సులు: పుట్టగొడుగుల పెంపకం 10 రోజులు కొవ్వొత్తులు ఉ అగరబత్తుల తయారీ -- 13 రోజులు సీసీ కెమెరా టెక్నీషియన్ -- 13 రోజులు ఇమిటేషన్ జ్యువెలరీ తయారీ -- 13 రోజులు జ్యూట్ బ్యాగుల తయారీ 14 రోజులు తేనెటీగల పెంపకం 20 రోజులు మగ్గం వర్క్ 30 రోజులు ఫోటోగ్రఫీ ఉ వీడియోగ్రఫీ 30 రోజులు ఎయిర్ కండిషన్ ఏ సి టెక్నీషియన్ 30 రోజులు టైలరింగ్ శిక్షణ -- 30 రోజులు ఆసక్తి గల అభ్యర్థులు వనపర్తి జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆర్ సెటి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9885940945, 8522088978 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.నిరుద్యోగ యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా స్థిరపడాలని డైరెక్టర్ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28:**




విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, విద్యా బోధన తీరు, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ప్రభుత్వం మెనూ ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, విద్యారంగ అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు తయారు చేసిన మట్టి ఆకృతులను పరిశీలించారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఇంటి నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# ఆటగాళ్లపై నమ్మకం ఉంచడమే ముఖ్యం

## ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్

టీ20 ప్రపంచ కప్ 2026 సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా ఎదుర్కొన్న పరాజయం జట్టు ఎంపికపై అనేక సందేహాలను రేకెత్తించింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఐసీసీ రివ్యూలో మాట్లాడుతూ.. భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనుసరిస్తున్న వ్యూహాలను తప్పుబట్టారు. కేవలం ప్రత్యర్థి జట్టులోని ఆటగాళ్లను బట్టి జట్టులో మార్పులు చేయడం వల్ల ఆశించిన ఫలితాలు రావని.. ఇది టీమ్ స్థిరత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా ఒత్తిడి ఉన్న సమయంలో ప్రయోగాల కంటే అత్యుత్తమ ఆటగాళ్లపై నమ్మకం ఉంచడమే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. గత మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను తుది జట్టులో తీసుకోకపోవడాన్ని రికీ పాంటింగ్ తీవ్రంగా విమర్శించారు. ప్రత్యర్థి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారనే కారణంతో అక్షర్‌ను పక్కన పెట్టి, వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడం సరైన నిర్ణయం కాదని ఆయన పేర్కొన్నారు. ఒకే ఒక మార్పు వల్ల టోర్నమెంట్ తలరాత మారిపోదని, అక్షర్ వంటి కీలక ఆటగాడిని పక్కన పెట్టడం వల్ల జట్టులో ప్రతికూల సంకేతాలు వెళ్తాయని పాంటింగ్ విశ్లేషించారు. పరిస్థితులకు అనుగుణంగా బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ముందే నిర్ణయించుకోవాలని సూచించారు. చెన్నైలో జింబాబ్వేతో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని రికీ పాంటింగ్ సూచించారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకోవడం అత్యవసరమని ఆయన అన్నారు. బ్యాటర్ ఎడమచేతి వాటమా లేక కుడిచేతి వాటమా అన్న దానితో సంబంధం లేకుండా ఏ బ్యాటర్నయినా బోల్తా కొట్టించే నైపుణ్యం కుల్దీప్‌కు ఉందని గుర్తు చేశారు. అలాగే బ్యాటింగ్ లోతును పెంచడం కోసం బౌలింగ్ బలాన్ని తగ్గించుకోవద్దని.. టాప్-7 బ్యాటర్లే బాధ్యత తీసుకుని మ్యాచ్‌ను గెలిపించాలని ఆయన స్పష్టం చేశారు. డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణాన్ని ప్రశాంతంగా ఉంచాలని గంభీర్‌కు పాంటింగ్ సలహా ఇచ్చారు. టీమిండియాలో అద్భుతమైన ప్రతిభ ఉన్న ఆటగాళ్లు ఉన్నారని.. అనవసరమైన ఆందోళనలకు పోకుండా సహజసిద్ధమైన ఆట ఆడితే భారత్ ఖచ్చితంగా పుంజుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎంపికలో తీసుకునే చిన్న చిన్న నిర్ణయాల కంటే.. మైదానంలో బౌలర్లను కెప్టెన్ ఎలా ఉపయోగిస్తాడు అనేదే గెలుపోటములను శాసిస్తుందని పాంటింగ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులోకి!

టీ20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే జింబాబ్వేపై భారీ విజయం టీం ఇండియాకు అనివార్యం. ఈ కీలక మ్యాచ్ కోసం భారత జట్టులో మూడు మార్పులు చోటు చేసుకోనున్నాయి. తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశం ఉంది. రింకు వ్యక్తిగత కారణాలతో ఇంటికి వెళ్లడంతో సందిగ్ధత నెలకొంది. టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీం ఇండియా ప్రస్థానం ఉత్కంఠగా మారింది. ప్రతి మ్యాచ్ చావో రేవో అన్నట్లుగా మారడంతో జట్టు సెమీ ఫైనల్ చేరాలంటే కేవలం గెలుపుతో పాటు అదృష్టం కూడా తోడవ్వాలి. ముఖ్యంగా దక్షిణాఫ్రికా చేతులో ఎదురైన 76 పరుగుల ఘోర పరాజయం భారత్ నెట్ రన్ రేట్‌ను మైనస్‌లోకి నెట్టేసింది. ఈ పరిస్థితుల్లో భారత జట్టుకు గండం గట్టెక్కాలంటే జింబాబ్వేపై సాధారణ విజయం సరిపోదు. ఒక భారీ విధ్వంసం సృష్టించి, జింబాబ్వేను చిత్తుగా ఓడించి రన్ రేట్‌ను గణనీయంగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే వెస్ట్ ఇండీస్‌తో జరిగే చివరి పోరులో కూడా భారత్‌కు అవకాశం ఉంటుంది. ఈ కీలకమైన డూ ఆర్ డై మ్యాచ్ గురువారం, 26వ తేదీన చెన్నైలోని వేదికగా జింబాబ్వేతో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం టీం ఇండియా తుది జట్టులో మూడు కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ మార్పులు జట్టు బలాన్ని పెంచి, విజయావకాశాలను మెరుగుపరుస్తాయని భావిస్తున్నారు. మొదటి మార్పుగా, ఫామ్ లేమితో గత కొంతకాలంగా సతమతమవుతున్న తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్ జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. సంజు శాంసన్ బ్యాటింగ్‌లో స్థిరత్వాన్ని, దూకుడును తీసుకురాగలడని భావిస్తున్నారు. రెండవ మార్పుగా, వాషింగ్టన్ సుందర్ స్థానంలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులో చేరవచ్చు. అక్షర్ పటేల్ తన స్పిన్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ కీలక పరుగులు చేయగలడు. మూడవ, అత్యంత కీలకమైన మార్పు రింకు సింగ్‌కు సంబంధించింది. రింకు సింగ్ కుటుంబ అత్యవసర పరిస్థితుల కారణంగా హుటాహుటిన జట్టును వీడి ఇంటికి వెళ్ళిపోయినట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. తండ్రి అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, పరిస్థితులు విషమంగా ఉండటంతో అతడు వెంటనే వెళ్ళాల్సి వచ్చిందని సమాచారం. దీంతో గురువారం జింబాబ్వేతో జరిగే మ్యాచ్‌కు రింకు సింగ్ అందుబాటులో ఉంటాడా లేదా అనే సందిగ్ధత నెలకొంది. ఫినిషర్‌గా మెరుపులు మెరిపించాల్సిన రింకు ఈ ప్రపంచ కప్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. వ్యక్తిగత కారణాలు, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా అతడిని జింబాబ్వేతో మ్యాచ్‌లో ఆడించే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు, మ్యాచ్ జరిగే చెన్నై పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో రింకు స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మొత్తంగా, తిలక్ వర్మ స్థానంలో సంజు శాంసన్, వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ పటేల్, రింకు సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవులతో కూడిన ఈ మూడు మార్పులు జింబాబ్వేతో జరిగే ఈ డూ ఆర్ డై మ్యాచ్‌లో టీం ఇండియాకు కీలకం కానున్నాయి. ఈ మార్పులతో భారత జట్టు సెమీ ఫైనల్ రేసులో నిలబడటానికి పటిష్టంగా సిద్ధమవుతోంది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌ను జింబాబ్వేతో చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆడనుంది. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటం ప్రత్యర్థి ఆఫ్ స్పిన్నర్లకు వరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగల సంజూ శాంసన్ జట్టులోకి రావడం భారత్‌కు ఎంతో మేలు చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా చెన్నైలో శాంసన్‌కు ఉన్న రికార్డు కూడా అతనికి మద్దతుగా నిలుస్తోంది. అక్షర్ గతంలో క్లిష్ట సమయాల్లో అటు బంతితో, ఇటు బ్యాట్‌తో జట్టును ఆదుకున్నాడని గుర్తు చేశాడు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీసుకున్న కొన్ని ఎంపికలపై ఇప్పటికే విమర్శలు వస్తున్న తరుణంలో, జింబాబ్వేపై గెలవడమే కాకుండా సెమీస్ రేసులో నిలవాలంటే టీమిండియా వ్యూహాత్మకంగా అడుగులు వేయాల్సి ఉంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA




# ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.

# దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్టలతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.

# ఓజి దర్శకుడితో నాని బ్లడీ రోమియో

'ఓజీ' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని ఓ స్టైలిష్ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ, సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగమని సమాచారం. ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో భారీ ఎ÷-జగైట్మెంట్ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ తృప్తి డిమ్రి పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆమె సందీప్ రెడ్డి వంగా- ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్‌లో నటిస్తోంది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో కూడా ఆమె ఓకే అయితే, ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా అవుతుంది. 'యానిమల్ ' చిత్రంతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అంటున్నారు సినీ విశ్లేషకులు. ఒకవైపు రా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్, మరోవైపు స్టైలిష్ యాక్షన్ డ్రామా ఇలా రెండు విభిన్న జానర్లలో నాని తన నటనా పరిధిని విస్తరించుకుంటున్నాడు. కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఈ రెండు సినిమాలతో మరోసారి తన రేంజ్‌ను నిరూపించు కునేందుకు సిద్ధమవుతున్నాడు. మొత్తానికి 'ది ప్యారడైజ్' మరియు 'బ్లడీ రోమియో' ప్రాజెక్ట్‌లు నాని కెరీర్‌లో కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అధికారిక ప్రకటనలు వెలువడే వరకు ఈ క్రేజీ కాంబినేషన్‌లపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# దేవరకొండలో ఘనంగా 'టైలర్స్ డే' వేడుకలు




అక్షరకలం దేవరకొండ

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పలువురు టైలర్లను సంఘం నేతలు శాలువాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే టైలర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. వారికి సబ్సిడీ రుణాలు అందించి వృత్తిని ప్రోత్సహించాలని, ఇళ్లు లేని అర్హులైన టైలర్లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్, గడ్డం బిక్షమయ్య, కడారి బలరాం, పాత్లావత్ లక్ష్మణ్ నాయక పాల్గొన్నారు.

# అనారోగ్యంతో ఉన్న కౌన్సిలర్ మురళిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

అక్షరకలం దేవరకొండ

దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళిని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ శనివారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మురళిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించడంతో పాటు, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, నాయకులు మోతిరాం నాయక్, ముదిగొండ హరిదాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



# డిండి మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బాలు నాయక్ శ్రీకారం

అక్షరకలం దేవరకొండ

: "ప్రజా ప్రభుత్వం అంటే మాటలు కాదు, చేతలని" దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శనివారం డిండి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. ఎర్రగుంటపల్లి, వావిల్ కోల్, కందుకూరు, సింగరాజుపల్లి, తవక్లాపూర్ గ్రామాల్లో ఒక్కోటి 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవనాలకు భూమిపూజ చేశారు. తవక్లాపూర్ నుండి వీరబోయిన జంక్షన్ వరకు 2.23 కోట్ల రూపాయలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అలాగే శక్రు తండాలో 5 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సింగరాజుపల్లిలో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను, కందుకూరులో స్కూల్ కాంపౌండ్ వాల్ మరియు సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు చెర్కుపల్లిలో దివంగత కాంగ్రెస్ నేత అడపాల పర్వత్ రెడ్డి దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# సైనిక పాఠశాల ప్రవేశ పరీక్షలో సాయి రిత్విక్ ప్రతిభ

అక్షరకలం దేవరకొండ

ఇటీవల వెలువడిన ఆల్ ఇండియా సైనిక స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఐస్సీ ) ఫలితాల్లో నరమోని సాయి రిత్విక్ అద్భుతమైన మార్కులతో అర్హత సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే తెలంగాణ రాష్ట్రానికి చెందిన సాయి రిత్విక్, కోరుకొండ (ఆంధ్రప్రదేశ్) సైనిక పాఠశాలలో ప్రవేశం కోసం నిర్వహించిన రాత పరీక్షలో తన సత్తా చాటారు. మొత్తం 300 మార్కులకు గాను 244 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాన్ని నమోదు చేశారు. సాయి రిత్విక్ సాధించిన ఈ విజయం పట్ల తండ్రి నరమోని జంగయ్య, తల్లి గీత, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయసులోనే క్రమశిక్షణతో కూడిన సైనిక విద్య వైపు అడుగులు వేస్తున్న రిత్విక్‌ను పలువురు ప్రముఖులు, గ్రామస్తులు అభినందించారు.



| విభాగం | విషయం | గరిష్ట మార్కులు | పొందిన మార్కులు |
| --- | --- | --- | --- |
| అ | భాష | 50 | 40 |
| బ | గణితం | 150 | 138 |
| చ | ఇంటెలిజెన్స్ | 50 | 42 |
| డ | జనరల్ నాలెడ్జ్ | 50 | 24 |
| | మొత్తం | 300 | 244 |

# సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి.. అదనపు కలెక్టర్‌కు వినతి

అక్షరకలం దేవరకొండ

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ కి సర్పంచులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవరకొండ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న రేట్లు చాలా తక్కువగా ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా వీటిని వెంటనే సవరించాలని కోరారు. అలాగే సర్పంచులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులుభరత్,బాబురాం,సత్యనారాయణ గౌడ్,బాలు,రమేష్,వ న్మథ రెడ్డి,లీలా తదితరులు పాల్గొన్నారు. సర్పంచుల వినతిపై సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.




# చరిత్ర పుటల్లో దేవరకొండ ఖిల్లా

ఏడు శతాబ్దాల రాచరిక వైభవానికి సజీవ సాక్ష్యం

రేచెర్ల వెలమల ధీరత్వం..


శత్రు దుర్భేద్యం దేవరకొండ దుర్గం

కొండల మధ్య కొలువుదీరిన పద్మనాయకుల కోట

అందమైన ప్రకృతి.. అంతుచిక్కని చరిత్ర

హిస్టరీ లవర్స్ కోసం హాట్ స్పాట్

నల్లగొండ నడిబొడ్డున పద్మనాయక వైభవం



అక్షరకలం దేవరకొండ

**నల్గొండ జిల్లాలోని దేవరకొండ ఖిల్లా దాదాపు 700 ఏళ్ల నాటి ఘనమైన రాచరిక చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. దీనికి సంబంధించిన ప్రధానాంశాలు ఇక్కడ ఉన్నాయి.**




## చారిత్రక నేపథ్యం...

నిర్మాణం : ఈ కోటను 14వ శతాబ్దంలో (క్రీ.శ. 1287 - 1475 మధ్య) రేచెర్ల వెలమ రాజులు నిర్మించారు. పద్మనాయక వంశానికి చెందిన మాదానాయుడు ఈ కోటను శత్రు దుర్భేద్యంగా తీర్చిదిద్దారు.

## రక్షణ వ్యవస్థ:

మూడు వైపులా కొండల మధ్య, ఎత్తైన రాతి గోడలతో ఈ కోటను నిర్మించారు. శత్రువులకు అందనంత ఎత్తులో బురుజులు, ఫిరంగుల వేదికలు ఉన్నాయి.

## కోటలోని విశేషాలు:




కోట్ల బావి (కొబ్బరినీళ్ల బావి): ఈ ఖిల్లాపై ఉన్న ఒక కోనేరులోని నీళు కొబ్బరినీళ్లలా తియ్యగా ఉంటాయని ప్రతీతి. ఎంతటి కరువు వచ్చినా ఈ బావి ఎండిపోకపోవడం ఇక్కడి ప్రత్యేకత. ఇప్పటికీ స్థానికులు ఈ నీటిని పవిత్రంగా భావిస్తారు.

## ధాన్యాగారాలు:

కోట కింద ఐదు భారీ ధాన్యాగారాలు ఉన్నాయి. యుద్ధ కాలంలో లేదా కరువు సమయంలో ప్రజలకు ఆహార కొరత రాకుండా ఉండటానికి వీటిలో లక్షా ఇరవై ఐదు వేల పుట్ల వడ్లను నిల్వ చేసేవారని చరిత్ర చెబుతోంది.

## ఆలయాలు:

కొండపైన ఓంకారేశ్వర శివాలయం, కాలభైరవ విగ్రహం మరియు నంది విగ్రహాలు ఉన్నాయి.



## దొంగల బండ:

నేరస్తులను శిక్షించేందుకు ప్రత్యేకంగా 'దొంగల బండ' అనే ప్రదేశం ఉండేది.

## ప్రస్తుత స్థితి:

దేవరకొండ ఖిల్లా ప్రస్తుతం అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. ప్రభుత్వం దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించి, సీసీ రోడ్లు, పార్కులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్-నాగార్జున సాగర్ రహదారికి సమీపంలో ఉండటంతో పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. రాచరికపు వైభవాన్ని చూడాలనుకునే వారికి ఇది ఒక గొప్ప గమ్యస్థానం. దేవరకొండ ఖిలా కొండపైన ప్రతి సంవత్సరం శివరాత్రి, ఏకాదశికి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దేవరకొండ ఖిలాను చూసేందుకు సమీప ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం వస్తుంటారు. ఖిలా కొండపైన ఓంకారేశ్వర్ శివాలయం ఉన్నది. ఆ ఆలయానికి ఉత్తర భాగాన ఉన్న కోనేరులో నీళ్లు కొబ్బరి నీళ్లలా కనిపిస్తాయి. ఆ నీళ్లు తాగితే మంచి జరుగుతుందని అక్కడి ప్రజల నమ్మకం. ఏ కాలంలోనైనా కోనేరు ఎండిపోదని అక్కడి వారు చెప్తుంటారు. దేవరకొండ ఖిలాలోకి ప్రవేశించేటప్పుడు రెండు సింహ ద్వారాలు ఉంటాయి. వాటిని దాటి కోటలోకి వెళ్లగానే రేచర్ల వెలమవీరులు ఉపయోగించిన ఫిరంగులు దర్శనమిస్తాయి.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# దళితులపై దాడులు చేస్తే సహించేది లేదు



**మిర్యాలగూడ ఫిబ్రవరి 28 అక్షర కలం**

మిర్యాలగూడ పట్టణంలోని బాపూజీ నగర్ కు చెందిన మొండి కత్తి లింగయ్య సతీమణి జానకమ్మ గత 15 రోజుల క్రితం తనకిష్టమైన కుక్కని రోడ్డుమీద తీసుకొని పోతుండగా పది రోజుల మీ కుక్క వల్ల ఇబ్బంది ఎదురైతుందని జానకమ్మ మీద గొడవ దిగారు. ఆ గొడవ పెద్దగా మారి మొండి కత్తి లింగయ్య జానకమ్మల మీద అగ్రవర్ణాలైనా జొన్నలగడ్డ స్వప్న రెడ్డి, కొత్త శీను దంపతులు కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడం జరిగింది. ఈ దాడిలో జానకమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మొండి కత్తి లింగయ్య తక్షణమే పోలీస్ స్టేషన్ కెళ్ళి కేసు పెట్టారు. తదుపరి రోజుల్లో బిక్కుబిక్కుమంటూ భయపడుతూ. తరుణంలో మిర్యాలగూడ నియోజకవర్గంలో ఉన్న దళిత సంఘ నాయకులు అంతా మేమున్నామంటూ శనివారం లింగయ్య కుటుంబాన్ని పరామర్శించారు. మొండి కత్తి లింగయ్య కుటుంబాన్ని ఏం జరిగినా ఊరుకునేది లేదు అని దళిత సంఘ నాయకులంతా అండగా ఉన్నారు. ఈ కేసు మీద డిఎస్పి వీళ్లంతా త్వరగా విచారించి వాళ్లకు తగినంత శిక్ష వేయాలని. దళిత సంఘ నాయకులు కోరారు. లేనిపక్షంలో మా దళితుల పవర్ ఏంటో చూపిస్తామంటూ.. సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కత్తుల సూర్యనారాయణ. దైద సత్యం మాదిగ, మచ్చ ఏడుకొండలు మాదిగ, తలకొప్పుల సైదులు మాదిగ, మచ్చ శీను మాదిగ, ఉంగరాల వెంకటయ్య. సురేష్. శీను. తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి



**అక్షరకలం దేవరకొండ**

ప్రతి ఒక్కరూ శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు.శనివారం కొండమల్లెపల్లి మండలం బుడ్డోని తండాలో శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని ఆయన ఆకాంక్షించారు.దైవ చింతనతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఆయన తెలిపారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ , నేనావత్ కిషన్ నాయక్,ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు,స్వామి వారి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బుడ్డోని తండాలో వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ.. పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్



**అక్షరకలం దేవరకొండ**

కొండమల్లేపల్లి మండలంలోని చిన్న ఆడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డోని తండాలో శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భువనగిరి మున్సిపల్ చైర్మెన్ కు సన్మానం



**అక్షర కలం బీబీనగర్**

భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ లను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే, ఎంపీ ల సహకారంతో భువనగిరి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని వారు చైర్మన్ ను కోరారు. ఈ కార్యక్రమంలో కొండమడుగు మాజీ సర్పంచ్ సుర్వి వేణు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూసరి నరసింహ గౌడ్,అరిగే పాపయ్య ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అరిగే పోచయ్య, బొడ్డు శివ, బాబు, గుండ్ల పవన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ప్రతినిధులకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఘన సత్కారం

**అక్షరకలం దేవరకొండ**

స్థానిక దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ వి టి మాట్లాడుతూ.. యువత మరియు అనుభవజ్ఞులు ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం శుభపరిణామన్నారు. ముఖ్యంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్ 19వ వార్డు నుండి హ్యాట్రిక్ విజయం సాధించడం ఆయన సేవా నిరతికి నిదర్శనమని కొనియాడారు. పట్టణంలో క్రీడల అభివృద్ధికి ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాల నిర్మాణం చేపట్టాలని కోరారు.మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. అసోసియేషన్ సేవలను అభినందిస్తూ, క్రీడాకారుల సౌకర్యార్థం స్టేడియాల ఏర్పాటుకు పూర్తి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్ల శ్రీధర్ గౌడ్, కృష్ణ కిషోర్, పంతులాల్ నాయక్, తాళ్ల సురేష్, సన్నీ, జమీర్, వంగూరు వెంకటేశ్వర్లు, బొడిగ వెంకటేష్, మహమూద్, భాస్కర్ రెడ్డి, వైఎస్ కరుణాకర్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.



## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**





యాదాద్రి భువనగిరి జిల్లా లోని భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పూర్ లోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కళాశాలలో డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. వంటకు అవసరమైన సరుకులు, సామాగ్రిలను పరిశీలించారు. 9వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు.బాలికలను ఆప్యాయంగా పలకరిస్తూ, ఇష్టపడి చదువుకోవాలని, విద్యార్థుల యొక్క లక్ష్యాన్ని చేరుకోవాలని వారిలో స్ఫూర్తిని పెంపొందింపజేశారు. కళాశాల పరిసరాలను పరిశీలించారు. కళాశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలాన్ని శుభ్రపరచి విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఇందిరా, పోచంపల్లి ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ రగడ దురదృష్టకరం : గుండ్రపల్లి మాజీ ఉపసర్పంచ్ కాసాల



**అక్షరకలం, చండూరు**

చండూరు మండలం గుండ్రపల్లి గ్రామంలో గత ప్రత్యేక అధికారుల పాలనలో ఆరోగ్య ఉప కేంద్రం భవనం మంజూరు అయినప్పటికీ ఆనాటి ఎమ్మార్వో ల్యాండ్ పరిశీలనకు గ్రామానికి వచ్చి పలు ప్రదేశాలను పరిశీలించి ఎటు తేల్చకుండానే వెనుతిరిగారని, ఆరోగ్య ఉపకేంద్రం టెండర్ వర్క్ లో కాంట్రాక్ట్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ సైతం సోయి మరిచారని ఆ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కాసాల వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుండ్రపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఆరోగ్య ఉపకేంద్ర భవన శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ చండూర్, మెడికల్ ఆఫీసర్ పాల్గొన్న అంశంపై జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘన రగడ దురదృష్టకరమన్నారు. అవగాహన లేమి తో జరిగిన ఇట్టి సంఘటనకు ముగింపు పలికి ప్రతి ఒక్కరు గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు.

## ఫోక్సో కేసులకు సత్వర న్యాయం అందించాలి

**ఏ.జయరాజ్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు,**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**



యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజ్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు ఆవరణలో పోక్సో కోర్టు ప్రత్యేక అదనపు జిల్లా న్యాయమూర్తి మిలింద్ కాంబ్లీ పోక్సో కేసుల పరిష్కారం, బాధితుల రక్షణ, పునరావాసం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. జయరాజ్ మాట్లాడుతూ జిల్లాలోని పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు, చైల్డ్ లైన్ శాఖలవారికి పోక్సో కేసుల పరిష్కారంలో జాప్యం జరుగకుండా ఉండటానికి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి. మాధవి లత, జె జె బి కోర్టు న్యాయమూర్తి స్వాతి, సి డబ్ల్యూ సి అధ్యక్షురాలు బండారు జయశ్రీ, బాల రక్ష భవన్ కో- ఆర్డినేటర్ అనంత లక్ష్మి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి రవీందర్ రెడ్డి, సఖి ఒన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మిన్ విన్ని, భువనగిరి టౌన్ ఎస్.ఐ నరేష్ పాల్గొన్నారు.

## కొండమల్లేపల్లిలో పట్టపగలే దొంగతనం

**అక్షరకలం దేవరకొండ**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పట్టపగలే చోరీ జరిగినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బూరుగు లోకేశ్వర్ అనే వ్యక్తి శనివారం ఉదయం తన ఇంటికి తాళం వేసి సోదరి ఇంటికి వెళ్ళాడు. తిరిగి మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో వచ్చి చూడగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలోని ఆరు గ్రాముల బంగారు ఉంగరం, 5 వేల రూపాయల నగదును దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు



## పోచంపల్లి లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సుడిగాలి పర్యటన

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటి సారిగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పోచంపల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలో ఎస్సీ బాలికల వసతి గృహాన్ని,



పోచంపల్లి మండలం లోని జలాల్ పూర్ లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు లక్ష్యం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం పోచంపల్లి లోని చేనేత సహకార సంఘం, చేనేత యూనిట్ లను సందర్శించారు. చేనేత సంఘం ఎంత మంది సభలకు పని కల్పిస్తుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయి కిరణ్ చేనేత యూనిట్ ను సందర్శించిన కలెక్టర్ చేనేత చీరలు తయారి, వివిధ దశలను తెలుసుకున్నారు. చేనేత కార్మికుల ఇండ్లను సందర్శించి వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోచంపల్లి మున్సిపాలిటీ లోని ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, చేనేత శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ , ఏడిఓ బాలమోహన్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ భారత వాసుదేవ్, సొసైటీ సభ్యులు, స్థానిక కళాకారులు, కేజిబివి స్పెషల్ ఆఫీసర్ ఇందిరా, ఎస్సీ బాలికల వసతి గృహము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర జ్యోతి వెలిగించిన విద్యార్థులు

## ఏవిఆర్ గ్లోబల్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా

గండీడ్, ఫిబ్రవరి 28 (అక్షర కలం): మండల కేంద్రంలోని ఏవిఆర్ గ్లోబల్ స్కూల్‌లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ శాస్త్రీయ స్ఫూర్తితో కళకళలాడగా, విద్యార్థుల ఉత్సాహం ప్రతి మూలన కనిపించింది. శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు, సాంకేతిక ఆవిష్కరణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఉత్పత్తి, అంతరిక్ష పరిశోధనలు, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై రూపొందించిన మోడళ్లు విశేషంగా ప్రశంసలు పొందాయి. చిన్నారులు తమ ప్రయోగాల వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను స్పష్టంగా వివరిస్తూ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించారు. విద్యార్థి--విద్యార్థినులు శాస్త్రవేత్తల జీవిత విశేషాలపై ఉపన్యాసాలు ఇచ్చి శ్రోతలను ఆకట్టుకున్నారు. ప్రశ్నోత్తర పోటీలు, సదస్సులు, ప్రత్యక్ష ప్రయోగాల ద్వారా శాస్త్రంపై ఆసక్తి పెంపొందించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, భారత ఖ్యాతి గడించిన శాస్త్రవేత్త సి.వి. రామన్ 1928 ఫిబ్రవరి 28న 'రామన్ ప్రభావం'ను కనుగొన్నారని తెలిపారు. కాంతి వికిరణంపై చేసిన ఆ మహత్తర ఆవిష్కరణ భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిందన్నారు. ఆ కృషికి గాను ఆయనకు 1930లో నోబెల్ బహుమతి, 1954లో భారతరత్న పురస్కారం లభించాయని పేర్కొన్నారు. శాస్త్రరంగంలో ఆయన సుమారు 400కు పైగా పరిశోధన పత్రాలు, అనేక గ్రంథాలు రచించి చిరస్థాయిగా



నిలిచారని కొనియాడారు. శాస్త్రం అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదని, అది మన దైనందిన జీవితంలో ప్రతి అడుగులోనూ అవసరమని వివరించారు. విద్యార్థులు ప్రశ్నించే స్వభావాన్ని అలవరుచుకుని పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. శాస్త్రీయ ఆలోచనతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, దేశ పురోగతికి యువత శాస్త్రజ్ఞానాన్ని ఆయుధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాస్త్ర ప్రయోగాల ప్రాముఖ్యతను వివరించగా, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. తల్లిదండ్రులు కూడా పాల్గొని చిన్నారుల సృజనాత్మకతను ప్రశంసించారు. శాస్త్రవిజ్ఞానంపై ఆసక్తి పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి: పోలీసు, రెవిన్యూ అధికారులు.

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఫిబ్రవరి,28) జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుంది అని నారాయణపేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు



నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు. పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యశీగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.

## దేవరకొండ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం



**అక్షరకలం దేవరకొండ**

స్థానిక ఎం.కె.ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ జి. కోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.కళాశాల సి ఓ ఈ జి. లింగారెడ్డి సర్ సీవీ రామన్ సేవలను, రామన్ ఎఫెక్ట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ క్విజ్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్. లింగమయ్య, డా. కె. రేణుక, నర్మదా దేవి, వెంకటేష్ పాల్గొన్నారు.

## పోచమ్మ గుడి గోపురం శంఖుస్థాపన



**అక్షర కలం బీబీనగర్**

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రంగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ గుడి గోపురం శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ గ్రామ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, బీబీనగర్ మాజీ ఎంపిటిసి గోలి నరేందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల ఆంజనేయులు గౌడ్, బీబీనగర్ వార్డ్ సభ్యులు ఆకుల రాజ్యలక్ష్మి రవి, కాసుల వరలక్ష్మి మహేశ్, మంగ అశోక, కట్ట వినోద్, నెల్లుట్ల శ్రీశైలం, పిట్టల శామాల శ్రీనివాస్, ఆకుల దివ్య సాయి, బుర్రి సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొట్ట సత్యనారాయణ, దొడ్డ శ్రీనివాస్, తుమ్మల నరసింహారెడ్డి, మాజీ వార్డు సభ్యులు దాతరీ రవి, కాసుల జంగయ్య మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వార్డు లోని సమస్యలు పరిష్కారించాలి

**మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం**

**కౌన్సిలర్ సూదగాని సరిత**



**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

భువనగిరి మున్సిపల్ పరిధి లోని 28 వ వార్డులో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రామలింగం కు వార్డు కౌన్సిలర్ సూదగాని సరిత రాజు గౌడ్ శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూదగాని సరిత రాజు గౌడ్ మాట్లాడుతూ 28 వ వార్డులో ఉన్న కుక్కల, కోతుల సమస్య కి శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె కోరారు. వార్డులో అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం, సీసీ రోడ్లు రిపేర్, శిదిలావస్థలో ఉన్న భవనాల తొలగింపు, పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆమె కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో “యువ టీం” కన్వీనర్ సూదగాని రాజు, యువజన కాంగ్రెస్ నాయకులు పోత్నక్ సన్నీ, కొంగరి శ్రీ రాఘవ, పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షర కలం..**



జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండాపూర్ లో ఈ రోజు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉదయం జాతీయ హరిత దళం జిల్లా సమన్వయ కర్త మాధవరెడ్డి ఆధ్వర్యంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయాలను గురించి వివరాలను ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. తర్వాత జిల్లా మొబైల్ సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో జీవ శాస్త్రం ఉపాధ్యాయులు విట్టల్ నాయక్ , దేవేందర్ లు సైన్స్ పరికరాలను పరిచయం చేస్తూ జీవ శాస్త్రం ప్రాముఖ్యత,మూడ నమ్మకాల పట్ల అవగాహన కల్పించారు. తదుపరి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు భీమశంకర్ కొన్ని ప్రయోగాలను చూపిస్తూ కాంతి,ధ్వని కి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్,క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు..

## రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అవసరం

**రాహుల్ గాంధీ ఈ దేశానికి ప్రధాని కావాలి**

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షర కలం..**



రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి అత్యవసరమని రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయవలసిన బాధ్యత మనందరిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ నాయకత్వంలో పదేళ్ల యుపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఈ దేశం లో ని గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి కల్పించి వారిని ఆర్థికంగా నిలబెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ ది సమాచార హక్కు చట్టాన్ని తెచ్చి దేశ ప్రజలకు ప్రతీ ప్రభుత్వ వ్యవస్థ జవాబుదారీ గా ఉండేలా, ప్రతీ సమాచారాన్ని ప్రజల ముందు ఉంచిన పార్టీ కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నష్టపోతుందని తెలిసినా, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ ప్రజల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన చరిత్ర సోనియా గాంధీ, రాహుల్ గాంధీలది

## విద్యార్థులు ఉన్నత ఆశయాలను ఎంచుకోవాలి : ఎంఈఓ సైదా నాయక్

**అక్షర కలం : చిట్యాల**

విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత ఆశయాలను ఎంచుకోవాలని చిట్యాల మండలం విద్యాధికారి సైదా నాయక్ అన్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండల పరిధిలో ఉన్న చిన్నకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల బాధ్యతలు, పరిపాలనా వ్యవస్థ, ప్రజాప్రతినిధుల విధులు వంటి అంశాలను స్వయంగా అనుభవిస్తూ అవగాహన చేసుకున్నారని తెలిపారు . స్వపరిపాలన దినోత్సవం ద్వారా విద్యార్థులు ఉపాధ్యాయుల కృషి, క్రమశిక్షణ ప్రాముఖ్యత, పరిపాలనా బాధ్యతల గౌరవాన్ని తెలుసుకుంటారని తెలిపారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అభ్యసించాలని సూచించారు.ఈ వేడుకలో విద్యార్థులు వివిధ హోదాల్లో వేషధారణలు ధరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు భూపాల్ రెడ్డి ఉపాధ్యాయులు బాలకృష్ణ, ఫిజిక్స్ ఉపాధ్యాయులు నయీముద్దీన్, గణిత ఉపాధ్యాయులు అసరాపల్లి మరియు శ్రీమతి మాధవి, సోషల్ టీచర్ సాయిబాబా, తెలుగు ఉపాధ్యాయులు చంద్రశేఖర్, హిందీ ఉపాధ్యాయులు శ్రీమతి రేవతి, వాలంటీర్లు శ్రీలత, నవ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.



## అశాస్త్రీయ భావాలకు అడ్డుకట్ట వేయాలి

**శాస్త్రీయ విద్యా విధానం కోసం కృషి చేయాలి**

**డాక్టర్ ముప్పా రామారావు**

**జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్**

**యాదాద్రి భువనగిరి అక్షర కలం**

దశాబ్ద కాలంగా ఏది శాస్త్రీయమో, ఏది మూఢ నమ్మకమో తెలియక ప్రజలు అయోమయంలో పడుతున్నారని, పాలకులు అశాస్త్రీయ భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్పా రామారావు అన్నారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం( రామన్ ఎఫెక్ట్) సందర్భంగా భువనగిరి పట్టణంలోని నవ భారత్ డిగ్రీ కళాశాలలో జరిగిన సైన్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ హేతుబద్ధ, తార్కిక విద్యా విధానంతోనే విద్యార్థుల్లో శాస్త్రీయ భావజాలం పెరుగుతుందన్నారు. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 51 ఏ హెచ్ తో పాటు 15 ఏ కూడా శాస్త్రీయ, మానవీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే కేవలం సైన్స్ పాఠాలు బోధించడమే కాకుండా ప్రయోగాలు చేయించడానికి ఉపాధ్యాయులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దేశంలో కరువు, నీటి సమస్య, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం లాంటి విషయాలను అర్థం చేసుకోవడం, వాటి పరిష్కారాలు కనుగొనడం కేవలం శాస్త్రీయ దృక్పథం ద్వారా నే సాధ్యమౌతుందని అన్నారు. భారత స్వాతంత్ర్యం అనంతరం మన మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అమలు చేసిన, హేతుబద్ధ శాస్త్రీయ ఆలోచనలు భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జవహర్ లాల్ నేహ్రు కాలంలో ప్రారంభించిన ఐఐటీ, ఏఐఐఎంఎస్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం అందించే సంస్థలు, నాగార్జున సాగర్ లాంటి నీటి పారుదల ప్రాజెక్టుల ఆలోచనలు ఇప్పటివరకు ఏ ప్రధాన మంత్రి కూడా ఆలోచించలేదని ఆయన అన్నారు. నవ భారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిక్కా ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల కోసం ఒక వైపు ప్రయత్నం చేస్తూనే మరోవైపు మన బాధ్యతలను విస్మరించరాదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో భారత రాజ్యాంగ పీఠిక పీఠిక ను విద్యార్థులతో కలిసి అతిథులు చదివారు. కొండల్ రెడ్డి చేసిన మేజిక్ లు, సుదర్శన్ పాడిన పాటలు విద్యార్థులను అలరించాయి. ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు కందుకూరి సుదర్శన్, జె. కొండల్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు జిట్టా భాస్కర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్, జిల్లా ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్, సీనియర్ జర్నలిస్టు మెరుగు చెన్నయ్య, నవ భారత్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫూల్ చంద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.







# వైద్యుల చూపు.. “పల్లెల వైపు ఉండాలి”

**నల్లగొండ మెడికల్ కాలేజీ వార్షికోత్సవంలో కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు**

**గ్రామీణ ప్రాంతాల్లో 65 శాతం మందికి అందని నాణ్యమైన వైద్యం**

**వైద్య విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించి నిష్ణాతులు కావాలని సూచన**

**ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నూతన ‘జిమ్’ ప్రారంభం**

**ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం**

కాబోయే వైద్యులు పట్టణ ప్రాంతం తో పాటు, గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల లో నిర్వహిస్తున్న వైద కళాశాల వార్షికోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణ ప్రాంతంలో ప్రజలకు 75 శాతం నాణ్యమైన వైద్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉన్నాయని,అయితే ఈ శాతం గ్రామీణ ప్రాంతంలో కేవలం 35 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయాలతో పాటు, ప్రాథమిక వైద్యరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప





కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ, ఇంకా 65 శాతం మంది గ్రామీణ ప్రాంతంలో ప్రజలు సరైన వైద్యశాలు పొందలేకపోతున్నారని, అందువల్ల వైద్యులందరూ గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ అంతంలేని చదువని, భవిష్యత్తులో పీజీ, స్పెషలైజేషన్ కి ఇది ఉపయోగపడ ుతుందని, అంతేకాక ఎంచుకున్న సబ్జెక్టులో నిష్ణాతులు కావాల్సిన అవసరం ఉందని, అందుకు వైద్య విద్యార్థులు భవిష్యత్తులో మంచి సబ్జెక్టులు ఎంచుకొని విజయం సాధించాలని ఆశించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన జిమ్ ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



# “మేమేమైనా టెర్రరిస్టులమా సార్..?”

## ఖమ్మం వెలుగుమట్లలో ఈటెల ముందు భోరుమన్న భూదాన బాధితులు..

## గుండెల్ని పిండేస్తున్న గూడు చెదిరిన పేదల ఆక్రందనలు!

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల.. ఒకప్పుడు పేదల ఆశలకు, కలలకు సాక్ష్యంగా నిలిచిన ఆ ప్రాంతం, ఇప్పుడు కన్నీటి సంద్రంగా మారింది. రెక్కలు ముక్కలు చేసుకుని, పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇళ్లు కళ్లెదుటే నేలమట్టం అవుతుంటే ఆ పేదలు గుండెలు పగిలేలా రోదించారు. తమకు జరిగిన అన్యాయాన్ని, అధికారుల అమానుషత్వాన్ని



బీజేపీ జాతీయ నాయకులు, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ముందు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ చెప్పుకున్నారు. వెలుగుమట్ల భూదాన భూముల బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ఈటెల రాజేందర్ కుదుపుకోతను, అక్కడ నెలకొన్న హృదయ విదారక దృశ్యాలను చూసి చలించిపోయారు.

### శత్రువుల మీద దాడి చేసినట్లు 4000 మంది పోలీసులతో వచ్చారు”

“పొద్దు పొద్దున్నే నాలుగు వేల మంది పోలీసు బలగాలను, మున్సిపాలిటీ వాళ్ళను, రెవెన్యూ వాళ్ళను వేసుకుని వచ్చారు సార్. మేమేమైనా టెర్రరిస్టులమా? దేశద్రోహులమా? ఎందుకు సార్ మా మీద ఇంత దౌర్జన్యం? కనీసం రెండు గంటల సమయం అడిగినా ఇవ్వలేదు. ఇంట్లోని వస్తువులు,



కనీసం గ్యాస్ బండలు, పిల్లల పుస్తకాలు కూడా తీసుకోనివ్వకుండా ఇళ్లను కూల్చేశారు..” అంటూ మహిళలు ఈటెల ముందు భోరుమన్నారు. గర్భవతులు, చిన్న పిల్లలు నాలుగు రోజులుగా చెట్ల కిందే నిద్రపోతున్నారని, చీకట్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### ’రూ.28 లక్షలు అప్పు చేసి ఇల్లు కట్టుకున్నా.. అంతా మట్టిలో కలిసిపోయింది”

ఒక తండ్రి తన గోడును వెళ్లబోసుకున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తుంది. “నాకు ఇద్దరు పిల్లలు సార్, ఒకరు డిగ్రీ, ఒకరు పీజీ చదువుతున్నారు. నాకున్న పది లక్షలు, భార్య నాలుగు లక్షల బంగారం అమ్మి, మరో 14 లక్షలు అప్పు తెచ్చి మొత్తం 28 లక్షలు పెట్టి ఇల్లు కట్టుకున్నాను సార్. ఇప్పుడు ఆ ఇల్లు మట్టి దిబ్బ అయింది. నేను ఆ అప్పులు ఎలా తీర్చాలి? నా పిల్లలను ఎలా చదివించుకోవాలి?” అంటూ ఆ తండ్రి పడుతున్న ఆవేదన వర్ణనాతీతం.

### హైకోర్టు స్టేటస్ కో ఉన్నా కూల్చేశారు!

బాధితులు చట్టపరంగా తమకున్న హక్కులను కూడా అధికారులు కాలరాశారని ఆరోపిస్తున్నారు. “గత 8 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాము. మాకు ఇంటి నంబర్లు ఇచ్చారు, పన్నులు కడుతున్నాము. అన్నింటికీ మించి హైకోర్టు నుండి 6 ఆర్డర్లు ఉన్నాయి, ‘స్టేటస్ కో’ (ఎలా ఉన్నది అలానే ఉంచాలి) అని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా కలెక్టర్, అధికారులు ఖాతరు చేయలేదు. హైకోర్టును గౌరవించని వాళ్లు ఇక మాకు ఎక్కడ న్యాయం చేస్తారు సార్?” అని ఒక విద్యావంతురాలైన బాధితురాలు ప్రశ్నించడం అధికారుల తీరుపై అనుమానాలను రేకెత్తిస్తోంది.

### ’రియల్ ఎస్టేట్ మాఫియా కోసమే మా ఇళ్ల కూల్చివేత”

ఈ కూల్చివేతల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు. “ఇది భూదాన భూమి కాదు సార్, ఇదంతా ఒక రియల్ ఎస్టేట్ కుట్ర. స్థానిక నాయకులు (కొంతమంది పేర్లు ప్రస్తావిస్తూ) ఇక్కడ 100 కోట్ల రూపాయల విలువైన విల్లాలు కట్టుకోవడానికి, 62 ఎకరాల ఈ భూమిని కబ్జా చేయడానికి పేదలమైన మా పొట్ట కొట్టారు. పెద్దోళ్ల ఫామ్ హౌస్ లు అక్రమంగా ఉన్నా కూల్చరు, కానీ 50 రూపాయల గజం కొనుక్కుని గుడిసెలు వేసుకున్న మా ఇళ్లు మాత్రం కూల్చేస్తారా?” అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఈటెల రాజేందర్ భరోసా

బాధితులు రాత్రికి రాత్రే కప్పుకోవడానికి వేసుకున్న ప్లాస్టిక్ కవర్లు, కూలిపోయిన రేకుల షెడ్లను ఈటెల రాజేందర్ స్వయంగా పరిశీలించారు. కన్నీరు పెట్టుకుంటున్న వృద్ధులను, మహిళలను ఓదార్చారు. “చంటి పిల్లలు, గర్భిణీ స్త్రీలు అనే కనికరం లేకుండా, కనీసం బట్టలు, బియ్యం తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన తీరు అమానుషం” అని ఆయన మండిపడ్డారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయ పోరాటం చేస్తామని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ,భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు,గల్లా సత్యనారాయణ ,నాయకులు శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వర్లు, బండారు నరేష్, నున్న రవికుమార్, విజయరాజు, వీరవల్లి రాజేష్, కుమిలి శ్రీనివాస్, ఏలూరి నాగేశ్వరరావు,రవి రాథోడ్, శ్యామ్ రాథోడ్, కందుల శ్రీకృష్ణ, మందా సరస్వతి,మనీ , నకిరేకంటి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్షా కిట్లు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణీ



**ఉప్పల్, ఫిబ్రవరి 28(అక్షర కలం):**

నాచారం డివిజన్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్షా సామాగ్రిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కృషితో చదివి ఉన్నత స్థానాలు సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంబీబీఎస్‌లో ర్యాంక్ సాధిస్తే ఐదేళ్ల విద్యా ఖర్చు భరిస్తానని ప్రకటించారు. ఇప్పటికే 200 మందికి పైగా విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామంతపూర్‌లో 115సి బస్సు రూటు ప్రారంభం

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం -- మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు



**ఉప్పల్, ఫిబ్రవరి 28 (అక్షర కలం):**

రామంతపూర్ డివిజన్ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా మరో కీలక అడుగు పడింది. శుక్రవారం రామంతపూర్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన 115సి బస్సు రూటును మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు ప్రారంభించారు.టిఎస్ఆర్టిసి కాచిగూడ డిపోకు చెందిన ఈ బస్సు కోటి నుంచి రామంతపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్స్ వరకు, రామంతపూర్ బోడ్రాయి మార్గంగా నడవనుంది. ఈ రూటులో ప్రతిరోజూ 10 ట్రిప్పులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సేవలతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ప్రయాణం మరింత సౌకర్యవంతం అవుతుందని పేర్కొన్నారు.ప్రజల విజ్ఞప్తిని వెంటనే స్వీకరించి రూటు మంజూరు చేసిన కాచిగూడ డిపో మేనేజర్ సి.హెచ్. వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పావనికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బుర్ర రాజేశ్వర్, వేముల తిరుపతయ్య, తమ్మలి రవి, వీణ, ముస్తాక్, సురేష్, మురళి, సత్యనారాయణ, గుండె బిక్షపతి తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.రామంతపూర్ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని బండారు శ్రీవాణి వెంకట్రావు ఈ సందర్భంగా తెలిపారు.

## కేపీల్ రెడ్డి నగర్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

- అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, ఫిబ్రవరి 28 (అక్షర కలం)**

:మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్ రెడ్డి నగర్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కమిటీ కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వేగంగా పరిష్కరించాలని, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కోరారు. కమిటీ సభ్యులు అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కమిటీ సభ్యుడు పైళ్ల ప్రవీణ్ కుమార్, దుల్మిట్టా దయాకర్ రెడ్డి, రాపోలు శ్రీనివాస్, లింగాల రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ గ్రామ అబాధి స్థలాలను 22-ఏ నిషేధిత జాబితా నుండి తొలగించాలి -- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఫిబ్రవరి 28 (అక్షర కలం):మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ మండలం పరిధిలోని మల్లాపూర్ గ్రామ సర్వే నెం.84లోని గ్రామ అబాధి భూములపై మూడు నాలుగు తరాలుగా కుటుంబాలు నివాసాలు ఏర్పరచుకుని జీవిస్తున్నారు. అయితే 2007లో కోనేరు రంగారావు కమిటీ, రెవిన్యూ యాక్ట్ సవరణల ప్రకారం ఈ భూములను 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో మ్యుటేషన్లు, రిజిస్ట్రేషన్లు, గృహ అనుమతులు తదితర సదుపాయాలు నిలిచిపోయాయి. దీనివల్ల స్థానిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యపై స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి ను కలసి వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ గ్రామ అబాధి సర్వే నెం.84లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారి ఇళ్ల స్థలాలను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కమిటీ సభ్యుడు పైళ్ల ప్రవీణ్ కుమార్, దుల్మిట్టా దయాకర్ రెడ్డి, రాపోలు శ్రీనివాస్, లింగాల రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ జాగృతి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామిడి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీకి ఘన సత్కారం

-- మీడియా ఐక్యత అభినందనీయం

-- సేవా కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు

**ఉప్పల్, ఫిబ్రవరి 28(అక్షర కలం):**




ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీ సభ్యులను తెలంగాణ జాగృతి మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామిడి వెంకట్ రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమం తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరం ఫౌండర్, చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు, నూతన అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ నాయకత్వంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఐక్యంగా ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిటీ సమన్వయంతో పనిచేసి మీడియా ప్రతిష్ఠను పెంచాలని సూచించారు. క్లబ్ చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సమితి నాయకులు రాకేష్ గైకౌడ్, ఆర్. సాకూర్, హర్ష ఆస్థాన, ఆంజనేయులు, జె .సైదులు మరియు ఉప్పల్ మీడియా క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నంగునూరు మండలంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహణ

**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28**



సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలంలో టైలర్స్ డేను మేరు కుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి మేరు కుల సంఘ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కీర్తి బాలరాజు అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షులు గూడూరు యాదగిరి, కోశాధికారి కీర్తి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులు కీర్తి రాజు, అన్న రాజయ్య, కీర్తి ఆంజనేయులు, కాటారం ఆంజనేయులు తదితరులు హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం సంఘ నాయకులు సంఘ ఐక్యతను ప్రతిబింబిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరు సంఘం నాయకులు పలు డిమాండ్లు ప్రభుత్వానికి వినిపించారు. మేరు కుల వృత్తి సంఘాలకు సబ్సిడీతో కూడిన కుట్టు మిషన్లు అందజేయాలని, ప్రభుత్వ పాఠశాలల యూనిఫార్మ్ కుట్టు యూనిట్లను తప్పనిసరిగా మేరు కుల సంఘాలకే కేటాయించాలని కోరారు.

## పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలి

### వార్షికోత్సవ వేడుకలకు రూ.15,000/- విరాళం అందజేత ..వంగ రాజేశ్వర్ రెడ్డి

**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28:**

సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు విచ్చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్థులు డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి ఆహ్వానించగా, యువత మరియు ముదిరాజ్ సంఘం సభ్యులు



శాలువాతో సత్కరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, “పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను.భక్తి శ్రద్ధలతో ఈ వార్షికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ముదిరాజ్ సంఘం సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను అని పేర్కొన్నారు.అలాగే పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలకు నిరంతరం సేవ చేసే భాగ్యం కల్పించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.గ్రామ ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి అభివృద్ధి కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. వార్షికోత్సవ వేడుకల నిర్వహణకు తనవంతు సహాయంగా రూ.15,000/- నగదు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువత, మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# పన్నులు పెంచడం ప్రజలను ముంచడం ఢిల్లీ కి పంచడం కాంగ్రెస్ ప్రభుత్వం నైజం గా మారింది



అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28:

పన్నులు పెంచడం, ప్రజలను దంచడం, ఢిల్లీకి పంచడం అన్న చందంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని బి.ఆర్.ఎస్ నాయకులు పాల సాయిరాం, కోల రమేష్ గౌడ్, ఇర్షాద్ హుస్సేన్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం కాకుండా గాంధీ కుటుంబ సంక్షేమ కోసం పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజల సొమ్ము అంతా ఢిల్లీకి జారవేస్తున్నారని మండిపడ్డారు. అది సరిపోక పోగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 10 ద్వారా అన్ని రకాల వాహనాలపై పన్నులు పెంచి ప్రజలపై మరింత పన్నుల భారం వేస్తోందన్నారు. ఈ వెహికిల్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజల పక్షంగా పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే షాపుల్లో లేని యూరియా యాపుల్లో ఎలా ఉంటుందని రైతులను ఇబ్బందులకు గురి చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ యాప్లను తీసుకువస్తుందని దుయ్యబట్టారు. అధికారంలోకి రావడానికి సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేంతవరకు టిఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గ్యార శ్రీనివాస్, సర్పంచ్ రమేష్, చాంద్ పాషా, చింటూ, ఇమ్రాన్,సాయి చరణ్ పలువురు పాల్గొన్నారు.

## మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలి

ధ్వజస్తంభం ప్రతిష్టా మహోత్సవానికి 25,000/- విరాళం అందించారు.. వంగ రాజేశ్వర్ రెడ్డి



అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28:

సిద్దిపేట పట్టణంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకల్లో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ధ్వజస్థంభ ప్రతిష్ఠ వంటి మహోత్సవాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు.25,000/- రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.శ్రీ మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు యువతలో మంచి సంస్కారాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

## రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో 'మాక్ పార్లమెంట్'

విద్యార్థుల అలౌకిక ప్రదర్శన

స్పీకర్‌గా శ్రీనేత్ర

ప్రధానమంత్రిగా తడక చరణ్ తేజ

మహేశ్వరం, ఫిబ్రవరి 28,( అక్షర కలం )

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో శనివారం విద్యార్థులతో 'మాక్ పార్లమెంట్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టాల తయారీ, పార్లమెంటరీ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం జరిగింది.?వివిధ పాత్రల్లో మెరిసిన విద్యార్థులు ?ఈ నమూనా పార్లమెంటులో విద్యార్థులు వివిధ కీలక బాధ్యతలను స్వీకరించి, ఆయా పాత్రల్లో ఒదిగిపోయారు. స్పీకర్‌గా శ్రీనేత్ర ప్రధానమంత్రిగా తడక చరణ్ తేజ విద్యాశాఖ మంత్రిగా వాసవి, ఆర్థిక శాఖ మంత్రిగా: తన్వి, రైల్వే శాఖ మంత్రిగా హర్షిత, హోం శాఖ మంత్రిగా యాస్మిన్, ప్రతిపక్ష నేతగా శ్రీ మేఘన ఇతర విద్యార్థులు మంత్రులుగా, సభ్యులుగా తమ పాత్రలను అద్భుతంగా పోషించి సభను రక్తికట్టించారు.?నాయకత్వ లక్షణాలు పెంచేందుకే ?పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రఘు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భయం పోవడమే కాకుండా, నాయకత్వ లక్షణాలు ప్రజాస్వామ్యంపై గౌరవం పెరుగుతాయని పేర్కొన్నారు. చట్టసభలు ఎలా పనిచేస్తాయో ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఇది ఒక మంచి వేదిక అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు మంజుల ఇతర ఉపాధ్యాయ బృందం దగ్గరుండి పర్యవేక్షించి దిగ్విజయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా ఒక పవిత్రమైన బాధ్యత,.. వంగ రాజేశ్వర్ రెడ్డి

అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28:

గత 26 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలందించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి కె. ఇందిరాదేవి ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా ఒక పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప కర్తవ్యాన్ని ఇందిరాదేవి గారు ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వర్తించారని కొనియాడారు. 26 సంవత్సరాల పాటు అనేక మంది విద్యార్థులకు విద్యాబోధన చేసి, వారికి మంచి మార్గదర్శకత్వం చూపిన ఆమె సేవలు



చిరస్మరణీయమని అలాగే పుల్లూరు ఉన్నత పాఠశాల లో 8 సంవత్సరాలుగా సేవలు అందించడం చాలా సంతోషం అన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపుకు ఆమె చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు.విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని, యువతకు మార్గనిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. ఆమెకు ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని శ్రీ రాజేశ్వర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంచం లత వెంకట్ యాదవ్, ఉపసర్పంచ్ ఒగ్గు రాజేష్, వార్డు మెంబర్లు యోగి,ఉడుత వైనాష్,కుంచం నాగరాజు,మొలుగు ప్రవీణ్,రాజు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు: అడిషనల్ డీసీపీ లా ఆర్డర్



అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అడిషనల్ డీసీపీ లా ఒ ఆర్డర్ ప్రసాద్ రావు పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్ సందర్శించిన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ..జిల్లా సరిహద్దుల నుండి ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా విజబుల్ పోలీసింగ్ పటిష్టంగా అమలు చేయాలని అన్నారు చెక్ పోస్టుల ద్వారా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా వెంటనే చట్ట ప్రకారం జరిమానాలు విధించడం, కేసులు నమోదు చేయడం, వాహనాలను జప్తు చేయాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నిర్వహణ, డయల్ 100 కాల్స్, పిటిషన్ ఎంక్వైరీలు, విలేజ్ హిస్టరీ షీట్లు, హిస్టరీ షీట్లు, ఎన్‌బిడబ్ల్యులు, సిసిటిఎన్ఎస్, రిసెప్షన్, యుఐ కేసులు, వివిధ కేసుల్లోని వాహనాలు, పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, 5-ఎస్ అమలు, గ్రామ సందర్శన, అంతర్ రాష్ట్ర సరిహద్దు ఇసుక చెక్‌పోస్టులు, పెట్రోలింగ్ వ్యవస్థ, విజిబుల్ పోలీసింగ్ అమలుపై సమీక్ష జరిపారు.

## మార్గదర్శిని హైస్కూల్ లో ఘనంగా సైన్స్ ఫేర్.

అక్షర కలం / ఇల్లందు.




ఇల్లందు పట్టణంలోని మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫేర్ ను ఘనంగా నిర్వహించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్లు ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్లు యాదగిరి రాంబాబు, ఆర్వపల్లి రాధాకృష్ణ సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషి జీవన విధానం సైన్స్ తోనే ముడిపడి ఉందని అన్నారు. ఈ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం "స్వదేశీ టెక్నాలజీస్ ఫర్ వికసిత్ భారత్". భారత దేశ సమగ్ర అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యతను గుర్తించడం తో పాటు, దేశీయంగా వివిధ వర్గాల పౌరులకు తమ దైనందిన జీవితంలో ఉపయోగపడేలా సైన్స్ ను, సైంటిఫిక్ రీసెర్చ్ ను ప్రోత్సహించడానికి ఈ థీమ్ కు రూపకల్పన చేశారాన్నారు. మానవ సంక్షేమంలో శాస్త్రవేత్తల కృషి, విజయాలను గుర్తించడం కూడా ఈ సైన్స్ దినోత్సవం లక్ష్యమని,ప్రపంచవ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి చెందిన విధానాన్ని అర్థం చేసుకోవడం, ఈ రంగంలో మరింత కృషి చేయాల్సిన అంశాలను అన్వేషించి ఆ దిశగా కృషి చేయడం,తదితర మార్గాలు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడానికి ఉన్న ఉత్తమ మార్గాలు అని తెలిపారు. అందులో భాగంగానే పాఠశాల విద్యార్థుల్లో దాగిఉన్న వైజ్ఞానిక నైపున్యతను వెలికి తీసే విదంగా ప్రయోగాల ద్వారా ప్రదర్శించడం జరిగిందన్నారు. విద్యార్థుల ప్రయోగాలు ఎంతో ఆలోచింప చేశాయన్నారు. విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఒబల్లోజు వెంకన్న, గోపి, యాస్మిన్, మానస, రోజా తదితరులు పాల్గొన్నారు.

## సద్గురు శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ భగవంతుడి స్వరూపం.

సేవాలాల్ జయంతి ముగింపు ఉత్సవంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య



అక్షర కలం / ఇల్లందు.

బంజారా జాతికే కాదు సమాజ మొత్తానికి హిత బోధ చేసిన గొప్ప వ్యక్తి, భగవంతుడి స్వరూపంగా ఆరాధించడం బంజారా బిడ్డల అదృష్టంగా భావించాలని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. శ్రీ సద్గురు సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ముగింపు ఉత్సవంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ బంజారా బిడ్డల అభ్యున్నతి కోసం వారి సంక్షేమం కోసం బ్రిటిష్ వారితో, నైజాం నవాబుతో కొట్లాడిన గొప్ప వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని ఆయన జయంతి ఉత్సవానికి ఇంత తక్కువ మంది రావడానికి కారణం ఆయన మీద ప్రేమ తగ్గిందా అని ప్రశ్నించారు. లేక ఆయన ఉపన్యాసాలలో ఆయన ఇచ్చిన స్ఫూర్తి లో లోపం ఏమన్నా ఉందా అని ఆవేదన వ్యక్తం చేశారు. బంజారా బిడ్డల ఆరాధ్య దైవం. సేవాలాల్ మహారాజ్ జయంతి సంవత్సరానికి ఒకసారే వస్తుందని ఆయన జయంతి ముగింపు ఉత్సవానికి ఎన్ని పనులు ఉన్నా తాము చేసే వృత్తులను పక్కనపెట్టి తండాలు తండాలుగా కదలి రావాలని శాసనసభ్యులు కోరం కనకయ్య బంజారా బిడ్డలకు విజ్ఞప్తి చేశారు. సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను ఆయన చేసిన ఉపదేశాలను బంజారా జాతికి ఆయన చేసిన సేవా, పోరాటాలను, ఉపదేశాలను భావితరం బంజారా బిడ్డలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. 1739 సంవత్సరం అనంతపురం జిల్లాలో గుత్తిలో పుట్టిన సద్గురు సేవాలాల్ మహారాజ్ ఊరూరా తిరుగుతూ సమాజ మార్పు కోసం సమాజంలో మనిషి మనిషిని గౌరవించడం కోసం మద్యం ముట్ట వద్దని, జంతు బలి చేయవద్దని, చెడు వ్యసనాలు ఉండరాదని, బుద్ధుడి తర్వాత బుద్ధుడు లాంటి వారు సేవాలాల్ మహారాజ్ గొప్ప వ్యక్తి శ్రీ సంతు సేవలాల్ మహారాజ్ అని ఆయన కొనియాడారు. వెనుకబడి ఉన్న బంజార కుటుంబాల కోసం తండాలలో ఆసుపత్రి, బడి, గుడి, రహదారులు నిర్మించాలని పోరాడిన దీశాలి అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బంజారా కుటుంబాలు నివసించే తండాలలో ప్రతి తండా సేవాలాల్ జయంతిని గొప్పగా చేసుకోవాలని ఆయన స్ఫూర్తిని,ఆయన ఉపన్యాసాల ద్వారా ఇచ్చిన సందేశాలను, ఆయన జీవిత చరిత్రను భవిష్యత్ తరాలు తెలుసుకునే విధంగా బంజారా నాయకులు అధికారులు ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, ఇల్లందు మున్సిపల్ చైర్పర్సన్ దొడ్డ కిరణమిత్ర డానియల్, ఇల్లందు మున్సిపల్ వైస్ చైర్మన్ పెండ్యాల రాజు, ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఇల్లందు మాజీ వైస్ ఎంపీపీ మండల రాము , మాజీ ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యనాగేశ్వరరావు, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, ఇల్లందు ఎమ్మార్వో కోట రవికుమార్, ఇల్లందు ఎంపీడీవో కే.ధన్ సింగ్,ఇల్లందు కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షులు దొడ్డ డానియల్, ఇల్లందు పట్టణ సీఐ తాటిపాముల సురేష్,ఇల్లందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి సైదులు, కాకాటి భార్గవ్,ఇల్లందు శాసనసభ్యులు కోరం సతీమణి లక్ష్మి, కౌన్సిలర్లు చిల్లా విజయభారతి, మహిళా నాయకురాలు వరలక్ష్మి, కమల, కోరం పద్మ, మాజీ కౌన్సిలర్ పత్తి స్వప్న, మొగిలి ఈశ్వర్, కాంగ్రెస్ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ జాఫర్, కౌన్సిలర్లు నీలపు రమేష్, సిహెచ్. రమేష్, వేములవాడ సర్పంచ్ భానోత్ శారద, పట్టణ సీనియర్ నాయకులు బొల్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, ఇల్లందు మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సుదర్శన్ కోరి, తదితరులు పాల్గొన్నారు.

## కొమరయ్య స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాడాలి -జిల్లా కార్యదర్శి, షేక్ యాకుబ్ షావలి.

అక్షర కలం / ఇల్లెందు.

ఇల్లందు మున్సిపల్ కార్మికులు, మాతంగి కొమరయ్య, జాడీ శివ కుమారి, మొహమ్మద్ రఫీ ల సంతాప సభ శనివారం సంజయ్ నగర్ లో, ఏరియా అధ్యక్షులు పాయం వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈసభలో టియుసిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, షేక్ యాకుబ్ షావలి పాల్గొని ఒకే రోజు చనిపోయిన ఇల్లందు మున్సిపల్ కార్మికులు మాతంగి కొమరయ్య, జాడి శివకుమారి, మొహమ్మద్ రఫీ చిత్రపటాల ముందట టియుసిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి, మున్సిపల్ సహచరులు రెండు నిమిషాలు మౌనం పాటించి వారి చిత్ర పటాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల ఎడల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలా మొండిగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయల వేతనం లేకుండా ఈరోజు కార్మికుల కుటుంబాలు బతికే పరిస్థితి లేదని అన్నారు. మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజలు నిద్ర లేవకముందే ఉదయాన్నే ఊరువాడ గల్లిలు శుభ్రం చేస్తారని అన్నారు. ఈప్రభుత్వాల పెద్దలు సఫాయి అన్న నీకు సలాం, అంటారు, మున్సిపల్ కార్మికులను దేవుళ్లంటేనో, వారి కాళ్లు కడిగితేనో వారికి కనీస వేతనాలు రావన్నారు. కానీ నేతలకు మాత్రం సానుభూతి, మైలేజ్ వస్తుందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి సుప్రీం కోర్టు తీర్పును అమలు చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా కార్యదర్శి వేముల గురునాథంటి యు సి ఐ ఇల్లందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు కునూరు వీరన్న కోశాధికారి శేషయ్య నాయిని కృష్ణ దుర్గ మహేష్ బండి రాజమ్మ రాజేష్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ ఇల్లందు ఏరియా నాయకులు పిల్లి మల్లేష్, మాట్ల శీను, బాలాజీ సదా దుర్గా నాంచారి భారతి ఉమా రాజేశ్వరి మీనా కృష్ణవేణి, సంపత్ రవిరెడ్డి కాసిం పుష్ప స్వప్న జలంధర్ రెడ్డి మైబు రెడ్డి శ్రావణ్ సిద్ధంకి నాగరాజు సంజీవ్ కే శ్రీను వేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం



**మేడ్చల్, ఫిబ్రవరి 28 (అక్షరకలం)**

పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎల్లంపేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు అక్బర్జపేట్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా గృహ నిర్మాణం చేసుకున్నటువంటి మాసబోయిన వెంకటేష్ నాగరాణిల ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఎల్లంపేట మున్సిపాలిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రాజ బొల్లారం పాషా ఆధ్వర్యంలో నాయకులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. పేదలకు సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని, ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా తమ గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మాలోత్ శాంతి రాజు నాయక్, పార్వతీ తారయ్య, విగ్నేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ ముదిరాజ్, బాలేష్ యాదవ్, ప్రదీప్ రెడ్డి, రాజ బొల్లారం పాషా, మహంకాళి సురేష్, రఘురాం రెడ్డి, రెడ్డిపల్లి వెంకటేష్, సాయి, నాయకులు గుంటి రవి, గుంటి నరేష్, నాగేష్ గౌడ్, రాము, నవీన్ గౌడ్ పాల్గొన్నారు..

# యాపులకే పరిమితమైన యూరియా

**రైతులను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**రైతుబంధు ఎప్పుడు ఏస్తావ్ రేవంత్ రెడ్డి**

**మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య**



**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28:**

రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను పూర్తిగా విస్మరించారని రైతులకు రైతుబంధు ఎప్పుడు వేస్తావు చెప్పాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య మాజి ఏఎంసి వైస్ చైర్మన్ వేణు చక్రవర్తి అన్నారు. శనివారం నాడు మండల పరిధిలోని పాలమకుల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇప్పటివరకు రైతుబంధు వేయడం లేదని రైతులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే రైతుబంధు వేయాలన్నారు లేనిపక్షంలో మండల కేంద్రమైన నంగునూరులో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రైతు బంధు రైతు బీమా కల్యాణ లక్ష్మి లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతులకు ఎరువులను విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిదాని రైతులకు రైతుబంధు వేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.అలాగే రైతులకు యూరియా అందించ లేకపోతున్నారన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమైదన్నారు.ఈ కార్యక్రమం లో గంగుల రవి,శామంతుల కనకరాజు ల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల పైన వివక్ష చూపుతున్న రేవంత్ రెడ్డి

**ముదిరాజులను బి.సి "ఏ" లో చేర్చుతానని కాంగ్రెస్ మేనిపిస్టో పెట్టింది ఉత్తదేన**

**జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు**

**అక్షర కలం సిద్దిపేట ఫిబ్రవరి 28:**

ముదిరాజులను బిసి ఏలోకి మారుస్తానని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచి ముదిరాజ్ ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ముదిరాజులు నట్టేట ముంచిందని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మండిపడ్డారు.శనివారం రోజు జిల్లా అధ్యక్షులు యమ ధర్మ ముదిరాజ్ తో కలిసి జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి రెండు సంవత్సరాలు గడిచిపోయిన ముదిరాజుల బీసీఏ అంశాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని అన్నారు.ఎన్నికల సమయంలో బిసి డిక్లరేషన్ సభ కామారెడ్డిలో నిర్వహించినప్పుడు ముదిరాజుల ప్రధాన డిమాండ్ అయిన బీసీఏ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పరిష్కరిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచి హామీ ఇచ్చి ముదిరాజులను నమ్మించి ఓట్లు వేసుకొని ముఖ్యమంత్రి అయినాక నిర్లక్ష్య ధోరణితో ముదిరాజులను ఏ మాత్రం పట్టించుకోకుండా ముదిరాజ్ జాతిని నిండా ముంచడమే కాకుండా ముదిరాజ్ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడని అన్నారు తరాలు మారుతున్న ముదిరాజ్ తల రాతలు మారడం లేదని ముదిరాజుల హక్కులు దక్కాలంటే తెలంగాణ రాష్ట్రంలోని యావత్ ముదిరాజులంతా ఏకమై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మీద రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మీద పోరాటం చేయడానికి సిద్ధమై రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని వచ్చే స్థానిక ఎన్నికలలో ఎన్నికలలో ముదిరాజ్ సత్తా చాటాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడియ్యడానికి ప్రతి ఒక్కరు సిద్ధమై రేవంత్ రెడ్డికి గుణపాఠం నేర్పాలని సూచిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముదిరాజుల పట్ల ఆలోచించి జీవో నెంబర్ 15 పునరుద్ధరణ చేసి ముదిరాజ్ బీసీ ఏ లో చేర్చాలని డిమాండ్ చేశారు. జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, యామ ధర్మ, సందెబోయిన సతీష్, పరకపెల్లి యాదయ్య లు ఉన్నారు.



# ఘనంగా పివి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం

**మేడ్చల్,ఫిబ్రవరి 28 (అక్షరకలం):**

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పాపారాయ విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శంకరయ్య హాజరయ్యారు. పాఠశాల యాజమాన్యం ఎంఈఓ శంకరయ్యను పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో



సత్కరించడం జరిగింది. అనంతరం విద్యార్థులు చేసిన సైన్స్ కృత్యాలను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థులు చేసిన కృత్యాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయని ప్రశంసించారు. అనంతరం వారు మాట్లాడుతూ



?భారతదేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ తన అద్భుతమైన ఆవిష్కరణ రామన్ ఎఫెక్ట్ ను ప్రపంచానికి చాటిచెప్పిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 28న మనం జాతీయ సైన్స్ దినోత్సవం' జరుపుకుంటాము అని తెలియజేశారు.?1928 ఫిబ్రవరి 28న సి.వి. రామన్ కాంతి పరిక్షేపణం గురించిన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారని,ఈ ఆవిష్కరణకు గానూ ఆయనకు 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించిందని అన్నారు.విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ పొందిన మొదటి భారతీయుడు, ఆసియా ఖండపు మొదటి వ్యక్తి సర్ సివి రామన్ అని కొడియాడారు. ఆయన గౌరవార్థం 1986లో భారత ప్రభుత్వం ఈ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించిందని పేర్కొన్నారు.దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని, కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించడం నేటి యువత లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.విజ్ఞాన శాస్త్రం అంటే కేవలం ప్రయోగాలు చేయడం మాత్రమే కాదు, ప్రకృతి రహస్యాలను ఛేదించే నిరంతర అన్వేషణ అని తెలిపారు. అదేవిధంగా ?సైన్స్ అనేది ఒక సబ్జెక్టు మాత్రమే కాదు, అది ఒక ఆలోచనా విధానం అని,మూఢనమ్మకాలను పక్కన పెట్టి, ప్రతి విషయాన్ని తార్కికంగా ఆలోచించడమే సైన్స్ దినోత్సవం యొక్క అసలైన సందేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, అకాడమిక్ ఇంచార్జ్ అనిత ప్రియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో దేశానికి ప్రమాదం

**ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే బాధ్యత కమ్యూనిస్టులదే..**

**కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తోంది**

**దేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తోనూ ప్రమాదం**

**ఖమ్మం బోసు బొమ్మ సెంటర్లో యర్రా శ్రీకాంత్ విగ్రహావిష్కరణ... బహిరంగ సభలో సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు**

**యర్రా శ్రీకాంత్ విగ్రహావిష్కరణ సందర్భంగా త్రీ టౌన్ లో రెడ్ షర్ట్స్ అండ్ శారీస్ ధరించి 'యర్రా' కవాత్**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

మోడీ పాలనలో దేశానికి ప్రమాదం ఏర్పడిందని సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి ప్రమాదం ఏర్పడింది అని తెలిపారు. మహిళలు, దళితులు, మైనార్టీల పరిస్థితి ప్రమాదకర స్థితికి చేరిందన్నారు. దేశం ఇన్ని ప్రమాదాల మధ్య నలుగుతున్న నేపథ్యంలో కమ్యూనిస్టులు ప్రజల మధ్యన పనిచేస్తూ... ప్రజలను మేల్కొల్పాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలను అంటిపెట్టుకొని పని చేసే వారే నిజమైన కమ్యూనిస్టులని పేర్కొన్నారు. అటువంటి వారిలో ఒకరు యర్రా శ్రీకాంత్ అని చెప్పారు. శ్రీకాంత్ స్ఫూర్తితో ప్రజాతంత్ర ఉద్యమాలను నిర్మించాలన్నారు. ఖమ్మం నియోజకవర్గ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన స్థానిక బోసుబొమ్మ సెంటర్లో శనివారం ఏర్పాటు చేసిన యర్రా శ్రీకాంత్ విగ్రహావిష్కరణ బహిరంగ సభకు రాఘవులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం దివాళా తీయిస్తోందని అన్నారు. రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి... దిగుమతి సుంకం లేకుండా అమెరికా నుంచి వివిధ పంట ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రైవేటీకరణలో భాగంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి చర్యలను వ్యతిరేకించకపోతే భవిష్యత్తులో రీచార్జీ చేయకపోతే కరెంటు కట్ అవుతుందని హెచ్చరించారు.

**ప్రజా జీవనంలో అన్ని పార్శ్వాలను కమ్యూనిస్టులు స్పృశించాలి..**

కమ్యూనిస్టులపై నమ్మకం కుదరాలంటే ప్రజా జీవనంలోని అన్ని పార్శ్వాలను స్పృశించాలని రాఘవులు సూచించారు. అలా పని చేశారు కాబట్టే శ్రీకాంత్ ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా... మనకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. బూర్జువా పార్టీలు రకరకాల రూపాల్లో ప్రజలను ఆకర్షిస్తాయని, కులమత భావాలను రెచ్చగొట్టడమే కాకుండా... అవసరమైతే మోడీ లాగా దౌర్జన్యాలకు దిగైనా ప్రజలను తమ మార్గంలోకి తెచ్చుకుంటాయని చెప్పారు. కమ్యూనిస్టులు ప్రజల్లో ఉండి ఇటువంటి వాటిని తిప్పి కొట్టాలని, ప్రజా మార్గం పట్టాలని పిలుపునిచ్చారు. అలా పని చేశారు కాబట్టే శ్రీకాంత్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు.

**దేశానికి ట్రంప్ ప్రమాదం**

దేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో ప్రమాదం పొంచి ఉందని రాఘవులు హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి దిగుమతి సుంకం లేకుండా పంట ఉత్పత్తులను దేశంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కోడి కాళ్లు, సోయాబీన్, మొక్కజొన్నలు, పాల ఉత్పత్తులు, మిర్చి, పసుపు తదితర అమెరికా పంట ఉత్పత్తులను దేశం దిగుమతి చేసుకోవడం ద్వారా పౌల్ట్రీ, డెయిరీ రంగాలు దివాళా తీస్తాయన్నారు. 38 శాతం గా ఉన్న పాడి రైతులతో పాటు కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతింటారని హెచ్చరించారు.

**24న 'ఉపాధి' చట్టం రద్దుకు వ్యతిరేకంగా ర్యాలీ**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దును వ్యతిరేకిస్తూ మార్చి 24న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ, ర్యాలీ నిర్వహించనున్నట్లు రాఘవులు తెలిపారు. దేశంలో వైషమ్యాలు సృష్టించే కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాంటి పోరాటాలను నిర్మించారు కాబట్టే శ్రీకాంత్ చిరస్మరణీయునిగా నిలిచారని అన్నారు.

**సీపీఐ (ఎం) పోరాట ఫలితంగానే పేదలకు ఇండ్ల పట్టాలు**

సీపీఐ (ఎం) పోరాట ఫలితంగానే ఖమ్మంలోని 6,670 మంది పేదలకు ఇండ్ల పట్టాలు వచ్చాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోరాటంలో శ్రీకాంత్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. త్రీ టౌన్ పరిరక్షణ కమిటీకి నేతృత్వం వహించారని, ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం తపించారని అన్నారు. భూదాన్ భూముల్లో పదేండ్లుగా పేదలు ఉంటుంటే ఏమి చేశారని? ఇప్పుడు ఇండ్లను కూల్చడం ఏంటి అని ప్రశ్నించారు. శ్రీకాంత్ వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీని కంటికి రెప్పలా కాపాడుకున్న నేత అని కొనియాడారు. బోసు బొమ్మ సెంటర్ భవిష్యత్తులో శ్రీకాంత్ సెంటర్ గానూ మారాలని ఆకాంక్షించారు.

**'యర్రా' కవాత్..**

శ్రీకాంత్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఖమ్మం గాంధీచౌక్ నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు రెడ్ షర్ట్స్, శారీస్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మనవళ్లు ప్రదర్శించిన కర్ర సాము ఆకట్టుకుంది. సెంటర్ లో ఏర్పాటుచేసిన శ్రీకాంత్ విగ్రహాన్ని బీవీ రాఘవులు ఆవిష్కరించారు. శ్రీకాంత్ ను అంతిమ గడియల నుంచి కాపాడేందుకు యజత్నించిన వారిలో ఒకరైన మధురై ఎంపీ వెంకటేష్ ఈ వైగ్రహావిష్కరణకు రావాల్సి ఉందని, మార్చి నెలలో ఆరు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో తమిళనాడులోనూ ఎలక్షన్స్ జరుగుతున్న దృష్ట్యా ఆయన రాలేకపోయారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మాదినేని రమేష్, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, పి. సోమయ్య, ఎం.సుబ్బారావు, చింతలచెరువు కోటేశ్వరరావు, సత్తుపల్లి, మధిర డివిజన్ కార్యదర్శులు శీలం సత్యనారాయణ రెడ్డి, మడుపల్లి గోపాల్ రావు, కార్పొరేటర్లు యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, శ్రీకాంత్ సతీమణి యర్రా సుకన్య తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
APTELRNI No. 2009/27246

# రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి: మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఫిబ్రవరి,28)



జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా 'అలీవ్ అరీవ్' 2వ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా మక్తల్ పట్టణంలోని అయ్యప్ప డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, సురక్షితమైన డ్రైవింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి మాట్లాడుతూ... యువత రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ వినియోగించాలన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల సమయంలో తలకు గాయాల తీవ్రత తగ్గి ప్రాణ నష్టం నివారించవచ్చని తెలిపారు. అలాగే మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి నిర్లక్ష్యపు చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి తన కుటుంబం, సమాజ భద్రత దృష్ట్యా రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితమైన డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్, విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐకేపీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ



ఎల్లారెడ్డి, ఫిబ్రవరి- 28 (అక్షర కలం)

ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో మహిళా సంఘాల నూతన భవన నిర్మాణానికి స్థానిక గ్రామ సర్పంచ్ స్రవంతి సాయగౌడ్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. అనంతరం సర్పంచ్ స్రవంతి మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధి కోసం భవనం ఏర్పాటు చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో మహిళల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నాగరాజు, ఎంపీఈఓ ప్రకాష్, పిఆర్ఏఈ పిచ్చయ్య, ఏపిఎం రామ్ నారాయణ గౌడ్, సిసి రమేష్, జిపిఓ సావిత్రి, వర్క్ ఇన్స్పెక్టర్ నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి సలీం, వివోఏ ఆంజనేయులు, మహిళాసంఘ గ్రామ అధ్యక్షురాలు యమునా మహిళా సంఘం సభ్యులు, మహిళలు, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఎల్లారెడ్డి, ఫిబ్రవరి -28(అక్షర కలం )

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులోని గండిమాసానిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టీచర్స్ పాత్ర పోషించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీచర్ పాత్ర పోషించిన వారు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజులు మాట్లాడుతూ నేటి బాల, బాలికలే రేపటి దేశ భవిష్యత్తు నిర్మాతలంటూ పాఠశాలలో సంబంధిత కార్యక్రమాల ద్వారా బాలబాలికలు ఆత్మస్థైర్యంతో గొప్ప వారిగా ఎదుగాలని ఆకాంక్షిస్తూ అభినందించారు. అనంతరం బోధనలో ప్రతిభ కన పరిచిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజులు, ఉపాధ్యాయులు వెంకటరమణ, సుభాష్, మురళి, రాధిక, సాయిలు, శివలింగం, సంజీవులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



ఎల్లారెడ్డ, ఫిబ్రవరి - 28( అక్షర కలం )

విద్యార్థులు శాస్త్రీయదృక్పథాన్ని అలవర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి గొప్ప పరిశోధకులుగా ఎదగాలన్నారు. నేడు శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనదేశంలో అగ్రదేశాలతో పోటీపడి ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థుల్లో అపారమైన సృజనాత్మక శక్తి దాగి ఉండి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం విజ్ఞాన శాస్త్రంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రకాంత్, అద్యపకులు శంకరయ్య, చంద్రకాంత్, రాణి, గోదావరి, గంగారెడ్డి, సిద్దిరాజు, శశిధర్, సంతోష్, సురేష్, సంగీత, స్వప్న, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక రక్షణ చట్టం కోసం న్యాయవాదుల పోరాటం

ఫిబ్రవరి 28 అక్షర కలం కల్వకుర్తి

న్యాయ వాదుల పై జరుగుతున్న దాడులు, బెదిరింపులు మరియు అవమానకర సంఘటనలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళనలు ప్రారంభించారు. న్యాయవాదుల గౌరవం, భద్రత పరిరక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణం లోని కోర్టు ఆవరణంలో 4 రోజుల నుండి నిరాహార దీక్ష సాగుతుంది. ఈ దీక్షను మార్చాల గ్రామ సర్పంచ్ కృష్ణా రెడ్డి, బావండ్ల మధు, నిమ్మరసం ఇచ్చివిరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక్కడ న్యాయవాదుల దీక్షను విరమింపజేసే కార్యక్రమంలో పాల్గొనడం నాకు గౌరవంగా భావిస్తున్నాను. సమాజంలో న్యాయవ్యవస్థకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదుల పాత్ర



అమూల్యమైనదని, వారి పై జరుగుతున్న దాడులు, బెదిరింపులు మరియు అవమానకర సంఘటనలు చాలా బాధాకరం మరియు న్యాయవాదుల గౌరవం, భద్రత కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. వారి భద్రత కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని చేస్తున్న డిమాండ్ న్యాయమైనదని ప్రభుత్వం ఈ అంశాన్ని గంభీరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్వకుర్తి కోర్టు ఆవరణంలో గత నాలుగు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదుల సంఘీభావం, తెలిపారు.

## బచ్పన్ స్కూల్ సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించిన కమిషనర్ మహమూద్ షేక్



ఫిబ్రవరి 28 అక్షర కలం కల్వకుర్తి

నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణ పరిధిలోని బచ్పన్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ మహముద్ షేక్ పాల్గొన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను సందర్శించిన కమిషనర్, వారి సృజనాత్మక ప్రదర్శనలను అభినందించి, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహించాలని ప్రోత్సహించారు. సైన్స్, టెక్నాలజీ విషయాల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## బ్రిలియంట్ స్కూల్‌లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ఫిబ్రవరి 28 అక్షర కలం కల్వకుర్తి

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో సైన్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం అధ్యక్షతన శనివారం విద్యార్థులకు క్విజ్, సైన్స్ టాలెంట్ టెస్ట్‌లు, డ్రాయింగ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 'సైన్స్ మానవాళి అభివృద్ధికి' అంశంపై పోటీలు జరిపి, సైన్స్ ప్రయోగశాల పరికరాలు, వైజ్ఞానిక పుస్తకాల ప్రదర్శనలు చేశారు. విద్యార్థులు దయాగ్రామ్స్, ఆవిష్కరణల చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం మాట్లాడుతూ, ఫిబ్రవరి 28న జరిగే ఈ దినోత్సవం భారత శాస్త్రవేత్త సి.వి.రామన్ కృషిని గుర్తుచేస్తుందని, ప్రయోగాత్మక అభ్యాసంతో విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. సైన్స్ ఉపాధ్యాయులు ప్రయోగాల విశిష్టత వివరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు అంజన్ రెడ్డి, సందీప్, షా, రాజు, సంతోష్‌తో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బడంగ్ పేట సరకిల్ పరిధిలోని రోడ్డు డివైడర్లపై అక్రమంగా ఏర్పాటైన ప్రకటన భోర్డులను వెంటనే తొలగించాలి :

హైదరాబాద్ : ఫిబ్రవరి 28,( అక్షర కలం న్యూస్ ):

బడంగపేట్ సర్కిల్ పరిధిలో రోడ్డు డివైడర్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులు మరియు బస్ షెల్టర్ల వద్ద జరుగుతున్న అక్రమ ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోవాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ కు నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్ణకంటి రంజీత్ కుమార్, మరియు ప్రోగ్రసీవ్ యూత్ లీగ్ సీటీ సెక్రటరీ కోల్లుర్ భీమేష్ లు కలసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రంజీత్ మాట్లాడుతూ, రోడ్డు మధ్యభాగంలో ఏర్పాటు చేసిన అనధికార ఫ్లెక్సీలు, హోర్డింగులు వాహనదారులకు దృష్టి భంగం కలిగిస్తూ ప్రమాదాలకు దారితీసే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే బస్ స్టాప్‌లు పార్కింగ్ స్థలాలుగా మారడంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రోడ్డుపైనే నిలబడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ మరియు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా వెంటనే అక్రమ బోర్డులను తొలగించి, బస్ షెల్టర్లను ఆక్రమణల నుంచి విముక్తం చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్ణగంటి రంజిత్ కుమార్, ప్రొగ్రసివ్ యూత్ లీగ్ సిటి సెక్రటరీ కొల్లూర్ భీమేష్ పాల్గొన్నారు.



## ఘనంగా టైలర్స్ డే వేడుకలు



మందమర్రి/ చెన్నూరు ఫిబ్రవరి 28 అక్షర కలం ప్రతినిధి:-

టైలర్స్ డే సందర్భంగా మందమర్రి పట్టణం అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణ లో మేరు సంఘం ఆధ్వర్యంలో శనివారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మార్కెట్ వ్యాపార సంఘం అధ్యక్షులు తమ్మిశెట్టి విజయ్ కుమార్, గంప ఆంజనేయులు పాల్గొన్నారు. ముందుగా మేరు సంఘం గౌరవ అధ్యక్షులు రాయబారపు జనార్దన్ ఇటీవలే స్వర్గస్తులైన సందర్భంగా ఐదు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మేరు సంఘం ఉపాధ్యక్షులు రాయబారపు కిరణ్ మాట్లాడుతూ.. దర్జా లేని దర్జీ బతుకులు ఈరోజు టైలర్స్ ది అయిందని, ప్రభుత్వాలు టైలర్స్ వృత్తి కొనసాగించే వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, బోటిక్, మిషన్ కుట్టే వారికి, మగ్గం వర్క్ చేసే వ్యాపారస్తులకు తగు సబ్సిడీలు, పనిముట్లు, అందించి, అభివృద్ధికి తోడ్పడాలన్నారు. వ్యాపార సంఘం అధ్యక్షులు విజయ్ మాట్లాడుతూ.. తప్పకుండా ఎవరైనా తమ వ్యాపారాలకు సబ్సిడీ కావాలనుకునే వారు బ్యాంకు ద్వారా సబ్సిడీ ఇప్పిస్తామని దానికి తగు పద్ధతులు పాటిస్తే మార్కెట్ కమిటీ ద్వారా ఎటువంటి సహాయం అయినా చేస్తామని తెలిపారు. టైలర్స్ కి ప్రతి సంవత్సరం మార్కెట్ వ్యాపార సంఘం ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని టైలర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం ఉపాధ్యక్షులు గట్ల సారంగపాణి, గంగన్న, రాయబారపు సుజిత్, కీర్తి శ్రీనివాస్, రాయబారపు రజిత, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, శివకుమార్, శ్రీనివాస్, సత్తయ్య, సుధాకర్, రాము, మూర్తి, శంకర్, గౌస్, కొమురయ్య, గోపి, నరేష్, నస్రిన్, షాహీన, శివకుమార్, పాల్గొన్నారు.

## ఏరియా పర్సనల్ విభాగ అధికారులతో సమీక్ష సమావేశం



మందమర్రి/ చెన్నూరు ఫిబ్రవరి 28 అక్షర కలం ప్రతినిధి:-

మందమర్రి ఏరియా డిజిఎం (పర్సనల్) సిహెచ్. అశోక్ ఏరియా పర్సనల్ విభాగ అధికారులతో సమీక్షసమావేశం శనివారం నిర్వహించారు. ఉద్యోగుల వివరాల నమోదు, గ్రాట్యు టీచెల్లింపులు, కారుణ్య నియామకాల పురోగతి, కోర్టు కేసుల వివరాలు, తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డీజిఎం మాట్లాడుతూ.. మందమర్రి ఏరియాలో పనిచే స్తున్న ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొంద వలసిన అన్ని టర్మినల్ బెనిఫిట్స్ నిర్దిష్ట గడువులో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల ప్రక్రియను ఆలస్యం చేయకుండా అర్హులైన వారికి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను తప్పనిసరిగా ఆన్లైన్లో నమోదు చేసుకో వాలని, ఎలాంటి లోపాలు లేకుండా సరి చూసుకోవాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న కోర్టు కేసుల గురించి కూడా సమీక్షించి, జీరో పెండెన్సీ దిశగా ప్రతీ ఒక్క అధికారి పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమము లో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ ఎండీ. ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్, కార్తీక్, వంశీ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## వార్డ్ లో పలు సమస్యలకు పరిష్కారం కౌన్సిలర్ విభూది మహేశ్వరి

అక్షర కలం వనపర్తి :

9వ వార్డ్ కౌన్సిలర్ విభూతి మహేశ్వరి మరికుంట విద్యానగర్ కాలనీ ఎల్బీనగర్ కాలనీ లక్ష్మీనరసింహ కాలనీ భగీరథ కాలనీ బుడబుక్కల కాలనీ లలో గత వారం రోజుల నుంచి ప్రతి స్తంభానికి అన్ని కాలనీలలో స్థానిక కౌన్సిలర్ విభూతి మహేశ్వరి 85 లైట్లు ను అమర్చడం జరిగినది గతంలో కొంత కాలనీలలో చీకటిమయంలో రోడ్లు కనిపించక ప్రజలు ఎన్నో అవస్థలు పడ్డారు ప్రజల కోరిక మేరకు ప్రతి స్తంభానికి లైట్లు వేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో, చీర్ల రాములు 8వ వార్డు మాజీ కౌన్సిలర్ విభూతి నారాయణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ 9వ వార్డ్ చీర్ల ఆంజనేయులు పాండు సాగర్ సుధాకర్ సత్యం గుంటి మహేష్ అనిల్ అర్జున్ రవి ప్రభాకర్ పాల్గొన్నారు



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955